
భారతీయత
దాని నిజతత్త్వము



అరవిందులు

భారతీయత
దాని నిజతత్త్వము

ద్వితీయ సంపుటము

శ్రీ అరవిందులు

ప్రకాశకులు:
శ్రీ అరవింద సొసైటీ,
తెలుగుశాఖ.
శ్రీ అరవిందాశ్రమము,
పుదుచ్చేరి-605002.

ప్రతులు: 500
అక్టోబరు 1974.

వెల: రు. 2-00

ముద్రణ:
ఆంధ్రభవన్ ప్రెస్,
శ్రీ అరవిందాశ్రమము,
పుదుచ్చేరి-605002.

పరిచయము

శ్రీ అరవిందులు, తమ పెద్ద అన్న (శ్రీ మన్‌మోహన్ ఘోష్) గారియందు ఎంతటి భక్తి, వినయ విధేయతలతో మెలగిరో వారికి వ్రాసిన యీ వుత్తరమునందు విశదమగుచున్నది. సోదర ప్రేమయొక్క యదార్థమైన విలువలు శ్రీ అరవిందుల నిజ జీవితములో ప్రతిబింబించినవి. అవి మనకు మార్గదర్శకములు—

అయినను పాశ్చాత్య జీవితమునకు, నాగరికతకు అలవాటుపడి, ఆ సాంప్రదాయములనే జీర్ణింపజేసికొని; ఆ దృష్టితో హైందవ సాంప్రదాయ సంస్కృతులను, పురాణేతిహాసములను కించపరచినట్లుగ వ్రాసిన వుత్తరమునకు సమాధానమే యీ పుస్తకమునందలి ప్రథమ భాగము.

శ్రీ అరవిందులు భారతీయతను సమర్థించుచు; వినయముతో యిచ్చిన సమాధానమునందు కూడ ఒక ప్రత్యేకత, వ్యక్తిత్వము, గంభీరతలు స్పష్టముగ గోచరించుచున్నవి. తద్వారా భారతీయ నిజతత్త్వమునందు, నిజధర్మమునందు శ్రీ అరవిందులకు యెంతటి ప్రగాఢానుభూతి గలదో సువిదిత మగుటయేగాక, భారతీయ సారస్వతమునందలి సూక్ష్మాతిసూక్ష్మములైన సజీవసత్యములను విపులీకరించుటను చక్కగ అర్థము జేసికొనవచ్చును.

రెండవది కళలు: దేశముయొక్క ఔన్నత్యతకు, విలువలకు యీ కళలే ప్రత్యక్ష నిదర్శనములనునది శ్రీ అరవిందులు యెంత చక్కగా వివరించిరో పాఠకులే గ్రహించగలరు. (ఈ వ్యాసము, లోగడ "భారతి" అను మాసపత్రికలో ప్రచురింపబడినది. వారి సౌజన్యముతో మరల ప్రచురించుచున్నాము. సం॥)

అమూల్యమైన యీ విషయములను ప్రత్యేక శ్రద్ధ తీసికొని, సరళమైన భాషలో చక్కగా అనువదించి; భారతీయ ఐతిహాసికమునందలి అగాధ సత్యములను శ్రీ అరవిందులెంత సునిశితముగా గ్రహించిరనునది తెలుపుటకు తోడ్పడిన డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం, ఎమ్. ఏ., పి. హెచ్ డి. (ఆంధ్ర విశ్వకళాపరిషత్, పోస్టు గ్రాడ్యుయేట్ సెంటర్, గుంటూరు) గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. వారి భాషా వైదుష్యమును గురించి వేరే వ్రాయపనిలేదు. దానికదే సాటి. తద్వారా శ్రీ పురుషోత్తంగారు తెలుగు వారికి గొప్ప సేవ చేసిరనుటలో సందేహము లేదు. ఇలాంటి అనువాదములను సహృదయులైన రచయితలు తరచు పంపుచు శ్రీమాతారవిందుల దివ్య సందేశవ్యాప్తికి తోడ్పడుదురని విశ్వసించుచున్నాము.

పుదుచ్చేరి-605002

15-8-1974

తెలుగుశాఖ

శ్రీ అరవిందాశ్రమము

The more ancient sculptural art of India embodies in visible form what the Upanishads threw out into inspired thought and the Mahabharata and Ramayana portrayed by the word in life.

—SRI AUROBINDO

వి ష య సూ చి క



1908 సం॥ లో శ్రీఅరవిందులు. (జాతీయ కళాశాల, కలకత్తా)

మేలుకొనర!!

మేలుకొనర జీవా!
ఆలోకింపర త్రోవ!!

అరుణారుణ కాంతులతో
'అర్క' బింబ ముదయించెను
అరవిందము వికసించెను
తరులన్నియు హసియించెను॥ ॥మేలుకొనర॥

మాతృశ్రీ మధురవాణి
గాత్రము పులకింపఁజేసె;
సత్యాన్వేషణ సల్పగ
నిత్యము చైతన్యమొదవె॥ ॥మేలుకొనర॥

అరవిందము నుపాసించి
నిరవధి సుఖశాంతి నంది
తరియింపగ నిదే మంచి
తరుణమోయి! భరతపుత్ర!! ॥మేలుకొనర॥

అతిమానసికాభివ్యక్త
మతి నిర్మలకాంతి పథము—
'మతిమంతుడు' దారిచూపె
గతి తప్పక గమియింపుము॥

మేలుకొనర జీవా!
ఆలోకింపర త్రోవ!!

మన సంస్కృతి సౌధము

(శ్రీ అరవిందుల కాళిదాసు ప్రథమ సంపుటి ఆధారంగా)

ధర్మ సందీపితము
వాల్మీకి ఋషి కవిత;
వ్యాసముని భారతి మ
నీషా ప్రభావితము॥

అసమానుఁడౌ కాళి
దాసకవి సత్కృతులు
రస సముజ్జ్వలనమై
ప్రసరించు తేజమ్ము॥

పాత్రలందు తాను స
ర్వాత్ర లీనమౌ నొకండు;
పాత్రకొక వినూత్న శక్తి
పాత్రత గల్గించు నొకడు॥

కథా కథనమందు నూత్న
విధమగు పంథాను బట్టి
శిల్ప గరిమతో ననల్ప
కల్పన గావించు నొకడు॥

తన్ను గౌరవింప గోర
డెన్నడు వాల్మీకి సుకవి;
తన రాముని భజియించుటె
ఘనతరముగ ఆతడెంచు॥

తాను జెప్పినదియె వేద
మని వ్యాసుఁడు శాసించును;
తన్ను పూజచేసి, జాతి
ఉన్నతి సాధించుమనును॥

తన కావ్యములన్ పఠించి
ఘన రస స్రవంతి మునిగి
తనరారగ ధార్మికులై
మనలఁ గోరు కాళిదాసు॥

మూఢంతస్తులతో గూడిన
మేడ మనదు సంస్కృతిగా
ముచ్చటించి రరవిందులు
నిచ్చట సందర్శింపగ॥

ఒక దానిని మించి వే
ఱొకటి ప్రకాశించు కతన
సకల మానవాళి మనో
వికాసమ్ము విస్తరించు॥

నాల్గవ యంతస్తు కూడ
కల్గియుండ దగు నయ్యది
జగద్గురువు శ్రీ శంకర
భగవత్పాదోజ్వలనము॥

అయ్యది ఆధ్యాత్మికమై
అలరారం దగునుగాని
కలసిపోయె నీ మూడిట
కలిమి బలిమి సమకూర్చుచు॥

భరతజాతి ఆధ్యాత్మిక
భావనకే నవజీవన
మార్గమ్మును జూపినట్టి
భర్గుడు శ్రీ జగద్గురుడు॥

మన సంస్కృతి, మన భావన
మన జాతికి గల విశిష్ట
తను తగ గుర్తించుటయే
మనకు ప్రథమ కర్తవ్యము॥

దీని విస్మరించు జాతి
కేనాడు విముక్తి రాదు;
ఉన్న కీర్తి సన్నగిల్లు;
మన్నింపరు జగజ్జనులు॥

పురాణగాథల ఆంతర్యము

నా సహోదరునకు —

నీజాబు నాకు కొలదికాలం క్రితమే చేరింది. అది ప్రస్తుతం నా యెదుట లేకపోయినా జ్ఞాపకమున్నంత మేరకు సమాధానం రాస్తాను. హైందవపురాణాలు ప్రయోజనాత్మకాలు కావని; అభిరుచి రహితాలని; క్షుద్ర భావోపేతాలని; గతానుగతిక భావాల కాశ్రయాలని; నిస్సంకోచంగా అందులో నిందింపబడినట్లుమాత్రం నాకు జ్ఞాపకముంది. ఈ నిందలో గమనింపదగిన ప్రధానాంశం— హైందవ పురాణాలు సహజమైనవికావని; మానవతా ప్రతిపాదకాలు, నిరాడంబర భావోపేతములు కావని; వీనిలోని పాత్రలు ఉన్నత నైతికస్థాయికి నిర్జీవాదర్శ మూర్తులనికూడా నీ యభియోగమైనట్లు ద్యోతకమౌతుంది.

ఇన్నాళ్ళు, నీ యభిరుచులు, నిర్ణయాలు నిర్దుష్టమైనవని, తిరుగులేనివని భావిస్తుండేవాడ్ని. ఏదో కొంత సంకోచంతోనే ఇప్పుడు నీతో నేను భేదిస్తున్నాను. నీవు ఘాటుగా నిందించిన విషయాన్ని సమర్థించటానికి; హైందవ తత్త్వోద్రేకంతో, హైందవ నియమాభిరుచుల కనుకూలంగా, తత్తదుచిత శైలిలో విరచితమైన కావ్యాన్ని; అట్టి విషయాన్నిగూర్చి అత్యంత జుగుప్సాభావంగల నీకు నేను అంకితంచేయటానికి ఎందుకు సాహసించానో వివరించటానికి అనుమతిస్తావనుకొంటాను. నిన్ను ఒప్పించటానికి నేను ప్రయత్నించటంలేదు, నన్ను నేను సమర్థించుకోటానికి; కనీసం నా దృక్పథాన్ని నిర్వచించటానికి ప్రయత్నిస్తాను. నేనెన్నుకొన్న కవితాకళలో నాకు పునర్వికాసం కల్గటానికికూడా నా యీ ప్రయత్నం పనికిరావచ్చు.

గ్రీకు నాగరకతా సంప్రదాయ మధుపాన మత్తతవల్లనే నీకీ హైందవ పురాణాలపై ఇటువంటి అనివార్యమైన హేయభావం కల్గింది. ఎందుకంటె గ్రీకు బాహ్య సంకుచిత సౌందర్యభావన, హైందవ తత్త్వానికి వ్యతిరిక్త మైంది. విస్తృత విశ్వజనీన మానవభావనకు పరిధిని కల్గించేది హిందూ తత్త్వం. అనంత నిరాకారానికి దారితీసేదిది. వాస్తవికాదర్శాలకు రెంటికి దూరమైన హైందవభావనలోను, ఊహల్లోను గ్రీకు నాగరకతా లక్షణాలు కొన్ని పొడగట్టకపోవు. అట్టివాని ఆధారంతో హైందవపురాణాలన్నీ అటువంటివేనని నిందించటం సహజం. ఈ లోపమే దాని కనివార్యమైన ప్రత్యేక లక్షణమౌతుంది. ఎందుకంటె, తీవ్ర సూక్ష్మకలంక సుకుమారాభిరుచుల్లోను; విమర్శన నిర్ణయాల్లోను, ప్రమాణికతను పరిరక్షించుకోటానికి గ్రీకు నాగరకత, అన్యనాగరకతా సహిష్ణువు కాకతప్పదు. తన హద్దుల్లోనే యితర నాగరకతలుకూడా వుండాలని అది ఆదేశిస్తుంది. తన్ను అతిక్రమించిన భావనను అమానుషమని, అసహ్యమని అది త్రోసిపుచ్చుతుంది. భిన్న భిన్న సన్నివేశాల కనుకూలంగా నిత్యం అభివృద్ధి పొందుతు, కళాత్మకానుభవాలతో పరిణతిచెందుతు, స్వభావ కుతూహలాయత్త సంజనిత సానుభూతి నీ నాగరకత త్రోసిపుచ్చుతుంది. హైందవ నాగరకతకున్న సర్వతోముఖ దృక్పథం; గ్రీకు స్వభావానుకూల సంకుచిత నాగరికతా సౌకుమార్యాన్ని భంగింపచేస్తుంది. కాబట్టే దాన్నిది త్రోసిపుచ్చుతున్నది. ఇది బాగానేవుంది. గ్రీకు నాగరకత అంత సుకుమారం కాకపోయినా, హైందవనాగరకత బహుముఖీనమైంది. నిరంతరం ఆదానప్రదానాల కవకాశమిచ్చేవి హైందవ కళా విమర్శలు. అందుచే వీనిలో తరచుగా అభినవాభిరుచి కుంటువడి, శకలమై, అనిశ్చిత రచనకు దారితీస్తుంది. ఒక్కొక్కప్పుడు అఖండ విజయాన్ని సంపాదించి, కవితా కళకుపకరించే క్రొత్త కళాస్వరూపాల్ని సంతరించుకొంటుంది. లేదా వినూత్న కవిత్వానుభవాల్ని చేకూరుస్తుంది. పూర్తిగా అవివేకంగా

కాకపోయినా, తన ఘనతకే సదా అజ్ఞానంతో కూడిన సంతృప్తి ననుభవించటంతోపాటు దాన్నే యితరత్ర అన్వేషించుకొనే స్వభావంగల గ్రీకు నాగరకత, హైందవ పురాణాల్నిగూర్చి ఎట్టి నిర్ణయం చేయగల్గుతుంది?

రెండు రకాల పురాణకథల్ని నేను జాగరూకతతో విచక్షిస్తాను. 1. మత, వేదాంతపరమైన ద్వంద్వార్థగాథలు. 2. మతాతీత వాస్తవికగాథలు.

మొదటి తరగతి గాథలు తర్కాతీతమైనవి. అన్వర్థదాయకములైన సంకేతాలతో గూడిన మధ్యకాలపు హిందూమతతత్త్వాన్ని ప్రతిబింబించే ఈ పురాణగాథలు ఒక విధమైన విచిత్రమనస్తత్వాన్ని ఉద్దేశించిన కవితగా రూపొందాయి. పాశ్చాత్యభావనకీ యసాధారణ పురాణకవిత వెగటుగా తోచింది. దీనితో ప్రాక్ప్రతీచీ విభేదాలు శాశ్వతంగా ఏర్పడ్డాయి. ఈ విభేదం మౌలిక స్వభావానికి సంబంధించింది. అందుచేత వీనిని సమన్వయించటం సాధ్యపడదు. ఇటువంటి పాశ్చాత్య మానసికప్రవృత్తి భావుకమైన మతాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. అసలు మతాన్నంటు అది అంగీకరిస్తే, అది విశద మూఢవిశ్వాసాత్మకంగా ఉండాలంటుంది. అట్టి మనస్సుకు సంకేతాత్మక పురాణగాథలు అసత్య శుష్క కళాప్రలాపాలుగా గోచరిస్తాయి. దీనికి విభిన్నమైన మనఃప్రవృత్తి వేరొకటుంది. అది ఆధ్యాత్మిక మతోన్ముఖమైందేకాక, వివిధ సంకేతాత్మక వాతావరణ సంవృతమైన మత భావుకతతో సమ్మిళితమై సంకుచిత మత విశ్వాసంనుండి రక్షించేదిగాను వుంటుంది. అంతేకాక, ఇట్టి భావనకు, అంధ విశ్వాసానికి అతీతమై, విశ్వాస రహిత మహోన్నత శిఖరాల నధిష్ఠించి వుంటుందీ మనఃప్రవృత్తి. ఇట్టి మనఃప్రవృత్తి గలవారికీ హైందవ పురాణగాథలపట్ల ఆదరాభిమానాలధికంగా వుంటాయి. అవి అట్టివారికి శాశ్వతానంద వికాసాలు ప్రసాదిస్తాయి. అట్టి మనస్తత్త్వం గలవారికీ హైందవగాథలు శక్తిమంతంగాను, ప్రబోధనాత్మకం

గాను వుంటాయి. ఒక్కొక్కప్పుడివి ఇతిహాస సాహస భావనకుకూడా దారి తీస్తాయి. ఇవి ఔచితీవిలసిత సత్యాన్వేషణోత్సుకతను. సౌందర్య కౌతూహలాన్ని సమకూర్చుతాయి. ఈ హైందవ పురాణగాథల్లో అభివ్యాప్తమైన వినూత్నతే వాని జీవగఱ్ఱ. ఇది యూరోపియనులకు అసంబద్ధ వినోద భావ వినూత్నతగా గోచరిస్తుంది. కాని మనకుమాత్రం ఆ వినూత్నత సహజము. సరసము అయింది. ఇట్టి వినూత్నతను హైందవగాథల్నుండి వైదొలగించటం వానిని నిర్జీవం చేసినట్లే. ఈ వివాదం కేవలం నిష్ఫలమైంది కాబట్టి యింతటితో దాన్ని విడిచిపెడదాం.

ఇంక మతప్రసక్తిలేని గాథల విషయం విచారిద్దాం. ఇవి చాలవరకు విపరీతాసహ్య వికృత భావోపేతమైనవి. ఈ వికృతభావనే వాని ప్రధాన లక్షణంకాదు. ప్రతిపాదన విధానం ప్రధానమైంది. కథాప్రతిపాదనం హైందవతత్త్వానికికూడా ముఖ్యమైందే. కాని అదొక్కటే అందులో ఆత్మానుభవాన్ని చేకూర్చే చరమలక్షణంకాదు. ఈ మతాతీత గాధలు క్షీణయుగంలో రచింపబడ్డాయి. నేటి వీని స్వరూపం హటాత్సంభవం. వ్యాసుని మహాభారతం మొదట్లో 24వేల శ్లోకాలతో కూడింది. ఆ తరువాత అది లేఖక కవుల హస్తాల్లో విస్తృతమైంది. కడకు కళావిహీనమైన అధమరచనలెన్నో అందులో తావు చేసుకొన్నాయి. ఇట్టి పరిస్థితుల్లోనే హైందవగాథలనేకం తామరతంపరగా ఈ దేశంలో ఉత్పన్నమైనాయి. నిరాడంబరము, నిస్తుల సౌందర్యోపేతమునైన మన ప్రాచీన గాథలెన్నో సక్రమంగా సంరక్షితంగాని కారణంగాను; నిరంతర నిస్సార కథాకల్పనా సాంగత్యంవల్లను, కళావిహీన వికృతాకృతి వహింటాయి. అయినా భారతీయ మహేతిహాసాలు, హైందవ స్వభావోచితమైనవే. అనంత శక్తిసామర్థ్యాలు కలవివి. మధురమైనవి. అనంతరకాలంలో రససిద్ధులైన మహాకవుల హస్తాల్లో నాటకాలుగా మహాకావ్యాలుగా ఇందులోని యితివృత్తాలు సుకుమారోదాత్త శిల్పకళాకృ

తిలో వికసించాయి. మహాభారతంలోని నిర్జీవము, నిస్సారమునైన శకుంతల కథ కవికుల గురువగు కాళిదాసుని మధురహస్తాల్లో రసవత్తర రూపకాకృతిని వహించి అతని రచనలన్నింటికి తలమానికమై సహృదయ హృదయైక వేద్యమై పరాకాష్ఠకెక్కింది. దీన్నిబట్టి కవుల హస్తస్పర్శలో ఒకే యితివృత్తం ఎంత విభిన్నాకృతి వహిస్తుందో నిర్ణయించవచ్చు.

నీవన్నట్లు హైందవ పురాణానికి గ్రీకు పురాణానికున్నంత సముత్సుకతా చైతన్యం కానరాదు. భారతీయ మనఃప్రవృత్తి నైతికంగా నిష్ఠురమైంది; ఆదర్శోపేతమైంది. అందువల్ల అది ఉద్రిక్తతకు సౌకుమార్యానికి విశేషావకాశాన్ని చేకూర్చదు. అంతేకాక, ధర్మాధర్మాల్ని, పుణ్యాపాపాల్ని నిరూపించే అనూచాన కవిత్వాడంబరత్వానికి కూడా ఇది అనుకూలమైంది కాదు. 'ఇడిపస్సు'లుగాని, 'అగమెమినాన్లు' గాని భారతీయ సృజనాత్మక శక్తికి సుదూరంగా నిలిచేవాళ్ళే.

పైని పేర్కొన్నట్లుగా, హైందవ పురాణాల్లో ఉన్న లోపం పూరింపరానిదని బహుశః నీవు భావించవచ్చు. కాని దాన్ని స్పర్ధతో అతిక్రమింపగల వాస్తవిక విలక్షణశక్తి హైందవ పురాణాలకున్నదని భావించే మనస్తత్త్వం గలవారిలో నేనొకడ్ని. చైతన్యం, బాహ్యాకర్షణ, భౌతికాభిరుచి అనే లక్షణాలు గ్రీకు సాహిత్యానివి. ఇవి హైందవ సాహిత్యంలో లోపించవచ్చు. అయినప్పటికి, వీనికన్న మిన్నగా భావింపబడే ఆధ్యాత్మిక సౌందర్య సముద్దీపనం భారతీయ సాహిత్యంలో ప్రస్ఫుటమౌతుంది. భూమి ఉపరితలాన్ని ఆవరించిన సౌందర్యాన్నేకాక, లోలోతుల్లో నిగూఢంగావుండే సౌందర్యపు పొరల్ని విశ్లేషించి, క్రమక్రమంగా తీవ్ర భావోజ్జ్వల సముద్దీప్తితో పరిభ్రమించి, ఆకాశంలో గోచరంగాని ఆదర్శభావ పరిక్రాంత విన్యాసాల్ని అన్వేషిస్తుంది భారతీయసాహిత్యం. ఇంకా విశదీకరిస్తాని విషయాన్ని. గ్రీకు

భారతీయ స్వభావాలు భిన్నమైనవి. గ్రీకుస్వభావం ప్రాణశక్తి కాగా, భారతీయుల స్వభావం తదతీతశక్తి. మొదటిది భౌతికమైతే రెండవది ఆధ్యాత్మికం. తొలిది విషయసుఖ పరిమితమైంది. మలిది విషయాతీత సుఖానుభూతి కలది. తొలిదాని ప్రకారం సూర్యుడు ప్రకృతిగతమైన వస్తువు మాత్రమే. దాని వెలుగు ఆనందదాయకం కాకతప్పదు. కాని భారతీయులకో; సూర్యుడు జడపదార్థంకాదు సరికదా; అతడో భగవానుడు; సత్యాన్వేషణ తత్పరతతో అహరహం ఆరాటించే భారతీయ మనఃప్రవృత్తికి హిరణ్మయ పాత్రతో సత్యాన్ని అపిహితమొనర్చిన మహాసంరక్షకుడుగా అతడు గోచరిస్తాడు. మనల్ని ఆవరించిన ప్రకృతిలోని ప్రత్యంశాన్ని గ్రీకులు అనుభవిస్తారు. కాబట్టి వీరు పరిమితము, పరిచ్ఛిన్నమునైన పూర్ణత్వాన్ని ఆశిస్తారు. కాని భారతీయులు అనంత పరివ్యాప్త ప్రకృతిని భావించి దాని యుదాత్తతలో అవలీలగా విహరిస్తారు. ఈ విధమైన ప్రవృత్తి కవితా విషయికంగా ప్రమాదభరితమైంది. పరిమిత సౌందర్యం. సమతారూపం, ఎప్పుడూ ఆకర్షణీయమైనవి. కవితానుగుణమైనవి. అధమకవులు రచించినా, గ్రీకు పురాణగాథలు మానవసౌందర్యాన్నిగాని, సుఖదుఃఖాలనుగాని ఎంతో కొంత నిరూపించకపోవు. కాని అనంతత్వాన్ని స్పర్శించే నేర్పు అందరు కవులకు అలవడే గుణంకాదు. అది అందరికు ఆకలింపుకాదు. ఎంతో శక్తిసామర్థ్యాలుల ఏ కొద్దిమందికోగాని అది సాధ్యపడదు. శక్తి హీనులకది బెడిసి కొడుతుంది; వికృతపు పొలిమేరల్లోకి విసరివేస్తుంది. ఈ విధంగా ఈ ప్రాచీన గాథల్లో స్థాయీభేదం ఎంతో పొడగడుతుంది. ఒకే గాథ ఆయా కవుల కళాకౌశల్య పేశలత్వాన్నిబట్టి భేదిస్తుంటుంది. ఒకటి ఉదాత్తశిఖరాల నధిష్ఠిస్తే, వేరొకటి అధోలోకాల్లో ఉంటుంది. ఉత్తమమా? అధమమా? అని నిర్ణయించటానికి వీలుపడని మధ్యతరగతి గాథలుకూడా కొన్ని వున్నాయి.

ప్రాచీనగాథల్లోని ప్రక్షిప్తాలను పరిహరించి, పరిశీలిస్తే, ఇప్పటికీ

అందులో ప్రకాశించే నిరాడంబర సౌందర్యం, ప్రజ్ఞాపాటవాలు నేటి భారతీయ కవుల కుపాధేయాలు కాకపోవు. ఈ విధమైన పరిష్కారం విదేశీయ భాషల్లో చేయటానికి ప్రయత్నించటం ప్రమాదకరమే.

నేనీ క్రింది కథాకథనంలో మన ప్రాచీనగాథ నొకదాన్ని ఆంగ్లప్రజానీకానికి ఆకర్షణీయమైన ఆహార్యంతో రూపొందింపచేసి అందించటానికి ప్రయత్నించాను. సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ మొదలైన వారిలాగా కేవలానువాదాని కుద్యమించలేదు. హైందవాంతరంగిక ధర్మాల్ని పరిపోషించటానికే ప్రయత్నించాను. అపరిచిత వస్తుస్వీకారంవల్ల ఎదురయ్యే గ్రామ్యలక్షణాల్ని పరిహరించాను. పౌరాణిక సంప్రదాయాలు, అభిరుచులు అపరిచిత సంస్కృతికి సుపరిచితం చేయటానికే ప్రయత్నించాను. ఇందులో అనేక కష్టనష్టాలు పతనాలు ఉన్నాయి. పాక్షికంగానైనా నేను విజయాన్ని సాధించానని నీవు భావిస్తే, నిజంగా ఎంతో తృప్తిచెందుతాను. విజయంకంటె అపజయమే తరచుగా సంభవించే ఇటువంటి ప్రయత్నాల్లో నా అపజయమే నాకు ఓదార్పు చేకూరుస్తుంది.

అనేక ప్రక్షిప్తాలతో కూడిన మహాభారతంలో రురు చరిత్రవుంది. అదేమంత పట్టయిన కథకాదు. అతి సాధారణమైంది. ఆంతరంగిక సౌందర్యం లేదందులో, అయినా అది మన పౌరాణిక కథల్లో అతి ముఖ్యమైందిగా భావింపబడుతున్నది. ఎందుకంటె అందులో కథకంటె భావం ప్రధానం. రురుని తాత 'భృగువు' వేదవాఙ్మయంలో గౌరవార్హుడు, పూజనీయుడు. ఆర్యచరిత్ర దేహళిలో నిల్చిన ఈ భృగుమహర్షి రూపం మనకు మసక మసకగా గోచరించినా, అత్యంత ప్రాచీనకాలంలో అతనిచుట్టు అజనిత గణాతీత జనానీకచ్ఛాయలు; అనేకోద్యమ సంప్రదాయాలు; అస్పష్ట మహావిప్లవాలు పరిభ్రమిస్తాయి. తరువాతి కథలో రాజసంతతి నంతమొన

ర్చిన ఈతని పుత్రుడు పరశురాముడు పవిత్ర ఋషి సంతతికి మూలపురుషుల్లో ఒకడౌతాడు. బ్రహ్మమానసపుత్రుడైన ఈ మహా తపోనిధి భృగువు పులోమ అనే అసురవల్ల చ్యవనుడనే కొడుకును కంటాడు. ఇతడు మాతృగర్భంలో ఉండగానే తండ్రి ఆత్మీయతను, మహత్తర తాపసిక శక్తిని అవర్జించుకొంటాడు. నాగరకతా జనకుడైన చ్యవనుడు కులపతి పీఠాన్ని అధిష్ఠించి సుప్రసిద్ధులైన అనేక వ్యక్తుల్ని సంసిద్ధం చేస్తాడు. ఊర్వశీ పురూరవులకు జనించిన ఆయువు ఈతని గురుకులంలోని బ్రహ్మచారే. ఆయువు చంద్రవంశపు మూలపురుషుడేకాక; ఇలా కులానికి కుదురుకూడా. ఈ వంశస్థులనేకులు భారతాంతర్గతమైన అంతర్యుద్ధాల్ని అణచి, చక్రవర్తులౌతారు.

చ్యవనపుత్రుడు ప్రమతికి, ఒకానొక అప్సరస మూలాన రురుడు జన్మించాడు. అతడ్ని గూర్చిందే యీ మన ప్రకృత కథ. తండ్రిలాగా ఇతడు తరువాత గొప్పమహర్షి అవుతాడు. కాని యితడు తన యౌవనంలో చిత్రరథునే గంధర్వరాజుకు, మేనకకు జనించిన ప్రమద్వర— అంటే శకుంతల కీమె అక్క— అన్నమాట; అనే అపార సౌందర్యరాశిని ప్రగాఢంగా ప్రేమించి భార్యగా స్వీకరిస్తాడు. కాని వారి అనుబంధం విశేషకాలం ఆనందదాయకం కాలేదు. పాపం! ప్రమద్వర, గ్రీకు గాథలోని 'ఇండిస్' లాగా సర్పదష్ట అవుతుంది. తన అర్ధాంగిని కోల్పోయిన రురుడు, దుఃఖోపశమనం పొందలేక పోతాడు. తాను తన ప్రియురాలితో సంచరించిన సాంద్రారణ్య గిరికుంజ ప్రదేశాలు సంచరిస్తూ, తన దుఃఖ తీవ్రతచే ప్రకృతినంతా దుఃఖమయం చేశాడు. కడకు దేవతలుసైతం అతని శోకోద్విగ్నతకు జాలిపడ్డారు. తన ఆయుర్దాయంలో సగభాగం అర్పిస్తే అతని అర్ధాంగి నతనికిస్తామన్నారు. ఇందుకు రురుడు సంతోషంగా అంగీకరించాడు. తన ఆయుయంలోర్దాని అర్ధభాగం చెల్లించి రురుడు ప్రమద్వరా పునస్సమాగమం పొందాడు. మహాభారతంతో అనుబంధింపబడిన కాలాంతర ప్రక్షిప్తాలను

పరిహరిస్తే, కథ ఈమాత్రమే. దీన్ని 'యురిడస్' కథతో పోలిస్తే, పైని వివరించినట్లుగా, హైందవ గ్రీకు పురాణ కవితా కళాకౌశల్యంలో గల తారతమ్యం విశదమౌతుంది.

'ఆర్ఫియస్' గ్రీకుపురాణాల్లో గొప్ప గాయకుడు. ఇతని భార్య 'యురిడస్'. ఈమెను విడిపించడానికి ఆర్ఫియస్ అంతర్లోకాలకు పయనిస్తాడు. ఆ లోకాధిదేవత 'హేడ్స్', హేడ్స్ ఆలయంలోకి యితడు ప్రవేశించి, మృత్యువును తన సంగీతకళా ప్రాభవంతో జయిస్తాడు. తన ప్రియురాల్ని విడిపించుకొని పైలోకానికి విజయంతో వస్తుండగా, మానవ స్వభావోచిత దౌర్బల్యంవల్ల ఆమెను కోల్పోతాడు. ఈ విషాదాంత విషయాన్ని, అపరిమిత ఊహాశక్తితో, ఆర్ద్రహృదయంతో, కంపనోద్రేకంతో గ్రీకులు నిరూపించారు. హైందవకథల్లో ఇంతటి ఆర్ద్రిత, వైవిధ్యం, విషాదాంత గాథానుకూల సౌకుమార్యం గోచరించవు. హైందవ కథకంతకు ఒకేభావం ఆధారం. అయినా ఆ ఒక్కభావం ఎంత ప్రబలమో!! మానవుడు తన అర్ధాయుష్షను నిష్ఠురంగా అర్పించుకొని, అర్ధాంగిని బ్రతికించుకోటం అనే దానిలోగల లోతైన రహస్యం అన్వేషింపదగిన అంశం. ఆలోచించేకొలదీ ఆశ్చర్యజనకంగా వుంటుంది. మానవ విధివిలాస కవాటాల నీ సంఘట్టన తట్టి తెరుస్తుంది. పరిమిత శక్తినుండి అనంతము, అగాధమునైన ఆలోచనా జగత్తులోనికి మనల్ని గాథ వాయువేగంతో తీసుకుపోతుంది.

నేనీ రురు కావ్యానువాదంలో సాధ్యమైనంతవరకు గ్రీకుల ఆర్ద్రితను, హైందవ సంయమన స్వభావాన్ని సమ్మిళితం చేయటానికే సాహసించాను. అయినా జాగరూకతతో హైందవతత్త్వాన్ని పౌరాణిక లక్షణాల్ని పరిపోషించాను. ఉదాత్తాదర్శ ఋజుభావోపేత హైందవపురాణ గాథాఫణితి, నియతమైంది. దాని పద్ధతిని మార్చే అవకాశం రచయితకు లేదు. నేను చెప్పేది

అందమైన గృహస్థ జీవితకథల్ని గూర్చి మాత్రం కాదు. పౌరాణికతను చేకూర్చేటప్పుడు గ్రీకు విధానాన్నిగాని, హిందూ విధానాన్నిగాని పూర్తిగా అనుసరించవచ్చు. నేను అనుసరించిన పద్ధతి నీవు ఏమాత్రం మెచ్చేది కాదేమో! అని జంకుతున్నాను. హైందవ పురాణేతివృత్తం ద్వివిధాదర్శాల సంఘర్షణకు సంబంధించిందే అవుతుంది. అందొకటి విశ్వజనీనమైంది. రెండోది తద్భిన్నమైంది. త్రిమూర్తులు మినహా ఇందులో మానవపాత్రలు, దేవతాపాత్రలుకూడా వుంటాయి. ఈ పాత్రలన్నీ చదరంగంలోని పావులవంటివే. విశ్వజనీన భావానుకూలంగానే అవి సంచరిస్తాయి కాని స్వతంత్ర ప్రతిపత్తి కలవికావు. మొదటిది జీవితంలోని దేవతాదర్శం. ఇది రాక్షసాదర్శంతో సంఘర్షణ పడుతుంది. ఇదే రామాయణ కథాదర్శం లేదా ప్రభుత్వపరంగాను, సాంఘికంగాను, సకలశక్తులను కూడతీసుకొని, ఆత్మాయత్తం చేసుకొని, సుస్థిర విశాల సామ్రాజ్యస్థాపనం కావచ్చు. ఇట్టి సంస్థాపనంలో ప్రబల హింసాత్మక స్వతంత్ర స్వాధికార స్వామిభావాలతో కూడిన నిరంకుశాధికారాన్ని, ఆత్మసమర్పిత సమతా న్యాయాలు ఆధారంగా, ధర్మబలంతో ఎదుర్కోటం కావచ్చు. ఇదే మహాభారతంలోని కీలకం. లేదా సావిత్రి కథలోలాగా, ఒకానొక నారీమణి భీకర నిశ్శబ్దతతో, అఖండ శక్తిసామర్థ్యాలతో, ప్రాణాలపహరించే మృత్యువునెదుర్కొనటమైనా కావచ్చు. కేవలం కుటుంబ కథేయనదగిన నలుని ప్రేమ గాథలోను, నైతిక పతనాన్ని అతిగమించే అత్యంత పవిత్ర దాంపత్యానురాగం గోచరిస్తుంది. ఇదే క్షీణయుగ ప్రత్యేకలక్షణం. ఈ రీతిగానే, రురు ప్రమద్వరల కథలో ప్రేమాధిపతి కాముడు, మరణాధిపతి యముడు ప్రముఖ స్థానం వహిస్తారు. వారే నా యీ కావ్యశీర్షిక నలంకరిస్తారు.

హైందవ పురాణాదర్శాల్లోని రెండో ప్రముఖలక్షణం— నీవు ప్రత్యేకంగా నిరసించటాని కెన్నుకొన్నదైనా— నేను సమగ్రంగా అభిమానించింది.

హిందూ పురాణపాత్రలు మూసల్లో పోసిన నిర్జీవ నైతికమూర్తులని నీ అభిప్రాయం. ఈ విషయం తిరిగి విమర్శిస్తాను. మన పురాణాల్లోని ప్రముఖ పాత్రలు ఆదర్శోపేతాలు అంటే, ఆ ఆదర్శాలు కేవలం సదాదర్శాలే అనుకోరాదు, దురాదర్శాలుకూడా కావచ్చు. మిశ్రాదర్శ పాత్రలుకూడా లేకపోలేదు. ఇవన్నీ ఆదర్శ ప్రతిపాదక పాత్రగణాలు. హైందవ సృజనాత్మక స్వభావం ఆయా పాత్రల్లో నిహితమైన ప్రవృత్తుల్ని, ఉత్సాహాదర్శాల్ని, ఆశల్ని పరిశీలించటం మూలంగాను ఈ రీతి పాత్రచిత్రణం కల్గుతుంది. అయినా యివి ఉత్తమపాత్రలు. రాముడు, సీత, సావిత్రి కేవలం మూసల్లో పోసిన నైతికోన్నత మూర్తులేనా? నేను వారి కథల్ని వాల్మీకి వ్యాసమహర్షుల సజీవ భాషలో చదివి, వారి సుఖదుఃఖాలకు ప్రమోద సంచలనాల్ని పొందాను. అటువంటి నేను, నీ అభిప్రాయంతో ఏకీభవించలేను. నిజానికి, ఆ నిశ్శబ్ద ప్రబలహృదయ సావిత్రి, ఎంతటి శక్తిమంతురాలో! ఎంతటి సూక్ష్మ సునిశిత సుకుమార ఆత్మీయతారూపిణి!! ఎంతటి సజీవాకర్షణ పాత్ర!!! ఇక శ్రీరాముడో! ఆతడు తన ప్రతి చర్యలోను దివ్యతేజస్సు నుట్టిపడచేస్తాడు. సీతామహాసాధ్వి— మధుర మంజుల తేజస్స్వరూపిణి; మానవతా ప్రేమ పరిపూర్ణురాలు; స్త్రీ జనోచిత బలదౌర్బల్యాల కాలవాలమైంది. వీరు నిర్జీవ పాత్రలా? రురు ప్రమద్వరలుకూడా ఆదర్శపాత్రలే. వారిలో ప్రేమ పరాకాష్ఠ కెక్కింది. ప్రతి ప్రేమభావం వారి విస్తృత ప్రేమపరిధిలో ఇమిడి పోతుంది. అయినా ఇతరత్ర ఏ ప్రేమాదర్శం ఇంత సమగ్రంగా ప్రకటితం కాలేదు. ఆదర్శ ప్రేమ నిజమైన శక్తి. అది కేవలం కామంకాదు. కేవలం ఉద్రిక్తత కాదు. కేవలం ఆధ్యాత్మికతకాదు. అయినా యీ లక్షణాలన్నీ ప్రేమలో కనిపిస్తాయి. అప్పుడే ప్రేమస్వరూపం సమగ్రమౌతుంది. ఈ లక్షణాలన్నీ పృథగ్భూతంగా పరిశీలిస్తే— కామం పాశవిక వాంఛ మాత్రమే అవుతుంది. ఉద్రిక్తత క్షణికమైంది. ఇక ఆధ్యాత్మికతో, దారితప్పిన మతాశయం. అయినప్ప

టికి అత్యంతానురాగంలో ఇవన్నీ అంతర్భాగాలే. ఆదర్శప్రేమను చెట్టుతో పోలిస్తే; ఇంద్రియవాంఛ, వేళ్ళకు అత్యవసరమైన మట్టివంటిదౌతుంది. ఉద్రిక్తత చైతన్యాన్ని చేకూర్చే వాయువు. చెట్టువాడిపోకుండా సంరక్షించే ఎండ వానల వంటిది, ఆధ్యాత్మికత. ప్రేమకు, మరణానికి మధ్యగల ఆదర్శ సంఘర్షణను చిత్రిస్తున్నాను కాబట్టి దీనికి కవితాస్వరూపాన్ని చేకూర్చాలంటె రెండు విషయాలు ముఖ్యంగా కావాలి. మొదట ప్రేమస్వరూపాన్ని బాగా చిత్రించాలి. తరువాత మృత్యు స్వరూపాన్ని బాగా నిరూపించాలి. ప్రేమ చిత్రణం ఆదర్శస్థాయిలో వుండాలి. అది భౌతికంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను శక్తిమంతంగా కడముట్టాలి. మొట్టమొదట భౌతికప్రేమను సరియైన ప్రాతిపదికమీద పరిపోషించాలి. మానసికోద్రిక్తతవల్ల దానికి సరియైన చైతన్యం సమకూర్చాలి. ఆధ్యాత్మికత దానికి అనంత శాశ్వతత్వాన్ని కలిగించాలి. ముప్పేటలుగా ఉన్న ఈ ప్రేమ, కడపటిదశలో ముప్పిరిగొని, ఏకత్వాన్ని పొందాలి. అట్టిప్రేమ సమగ్రమైంది. అటువంటి ప్రేమచిత్రణమే సమగ్రప్రేమచిత్రణం. ప్రేమ కావ్యభావన ఈ రీతిగా ఉండాలి ఇట్టిలక్షణాలు కొంతవరకైనా నా రచనలో ఉన్నాయో లేవో మీరే నిర్ణయించాలి.

కాని హైందవాభిరుచులు, ఇతిహాస రచనా నియమాలు, ఆలోచనా రీతులు, పాత్ర స్వభావాలు ఎంతగా ఒంటబట్టించుకొన్నా, హైందవ పురాణాన్ని ఆంగ్లీకరించడంలో తీవ్రావరోధాలు కల్గుతాయి. విషయంచుట్టు అనవసరమైద పదజాలం వ్యాపించే ప్రమాదం వుంది. పరిచితంగాని సందర్భోచిత సూచనలెన్నో వుంటాయి. ఇవన్నీ ఆంగ్లపాఠకులకు బుఱ్ఱకెక్కవు. ఇతః పూర్వం ఆంగ్లీకరించినవారు విశేషంగా 'స్థానిక చిత్రణ' వ్యామోహానికి లోనైనారు. లేదా సంస్కృత పదాలే అంతటా వుపయోగించి, ఘాటుగా రచన సాగించారు. అందువల్ల చదువరికి అడుగడుగునా అవరోధాలేర్పడ్డవి. చికాకు కల్గుతుంది వీనివల్ల. వస్తు స్వభావానుకూలంగా, సహజత్వం దెబ్బ

తిననంత మేరకు స్థానిక చిత్రణం సరిపడవచ్చు. అనువాదభాషలో బొత్తిగా అనుకూలమైన పదం లభించనప్పుడే మూలభాషా పదప్రయోగం సమర్థనీయ మౌతుంది. అట్లా కాకుండా, తరచుగా మూలభాషా పదప్రయోగం చేయటం అనువాదకుని సోమరితనాన్ని సూచిస్తుంది. ఆతని నిరుపయోగ పాండిత్యానికి నిదర్శనమన్నా అవుతుంది. సాంకేతిక పదాలను మినహాయిస్తే, ఆంగ్లాను వాదాతీతమైన సంస్కృత పదాలుకాని, భావాలుకాని పరిమితంగానే కనిపిస్తాయి. సూటిగా అనువదించటం కుదరనపుడు కొంత సర్దుబాటు చేసుకోవచ్చు. అదీ సాధ్యపడకపోతే, సంస్కృత పదంతోగాని, భావంతోగాని, సమానార్థకమైనదాన్ని కల్పించవచ్చు. అది ఆంగ్లపాఠకునకు సుపరిచితమైనదిగా ఉండాలి. అధిక పరిశ్రమతోకూడిన శబ్దాడంబరత్వంకన్న, యత్కించిత్ అసమగ్రతే మిన్న. అందుచేత నేను అనవసరమైన స్థానికపదాల నెన్నుకోలేదు. శబ్దాడంబరత్వాన్ని ప్రదర్శించటానికి ప్రయత్నించలేదు. ఒక్కొక్కప్పుడు ఆంగ్లపదం లభించకపోతే గ్రీకు పదాన్ని ఎన్నికచేశాను. ఉదాహరణకు 'అ ధో లో కా ధి ప తి' అనటానికి "హేడ్స్" అనే గ్రీకుపదం ప్రయోగించాను. ఇలాంటి అనువాదం న్యాయమేనని భావిస్తాను. ఈ విధమైన అనువాదంవల్ల కావ్యం, పాఠకుని భావన కందుబాటులో వుంటుంది. ఇట్లా కాకుండా కొన్నిమాటలున్నాయి. వాటిని వదలుకోటానికి పాఠకుడు ఇష్టపడడు నామటుకు నేను "ఋషి, నాగ, అశ్వత్థ, చంపక, కోకిల, కృతాన్త, ధర్మా"ది పదాల్ని విడిచిపెట్టటానికి నిరాకరిస్తాను. కోకిలకు 'కుక్కూ' అని; అశ్వత్థానికి 'ఫిగ్'అని కొన్నింటికి తుల్యపదాలు లభించకపోవు. అయినా పాఠకుడామాత్రం మూలపదప్రయోగాల్ని సహించాలి, కవితానుభూతి, సానుభూతిగల పాఠకుడు అనివార్యంగా ప్రయోగింపబడిన హైందవ పురాణ సూచనలన్ని కొన్నింటిని అవగాహన చేసుకోలేకపోడు. నేను ఇట్టి సూచనలన్ని చాలా పరిమితంగానే చేశాను. వీనిలో ఒకటి రెండు మినహా, తక్కినవన్నీ బుద్ధికుశలత, సాను

భూతిగల పాఠకునికి అర్థమయ్యేవే. హైందవేతిహాసంలోని పరిసరాలు; దాని వివిధావయవ సంపత్తి యథాతథంగా పరిపోషింపబడాలి. సరిగా నిరూపింప గల్గాలేగాని. హిందూపురాణాలలో కవితాసౌందర్య సూచనగాని. శక్తిగాని. లోపిస్తుందని భావించనవసరంలేదు. భృగుని మనుమడు. రురుడు. ఆర్య నాగరికతా ప్రారంభకాలంవాడు. ఐరావతి. చంద్రభాగ. శతద్రు. వితోత్స. విపష అనే పంచనదీ పరిసరాల్లో నివసించి, యుద్ధాలుచేస్తు. వీరగీతాలాలపిస్తు ఉండేదప్పటి మనజాతి. అప్పుడు మనవంగభూమి మహానదీ ప్రవాహాలకు; క్రూర జంతుజాలయుత కీకారణ్యాలకు ఆకరమైంది. అక్కడక్కడ జాతులుగా ఏర్పడుతున్న ఆటవికులుతప్ప, మానవ నివాసాలు లేవు. మానవ సంతతికి భూమినిగూర్చి అంతగా పరిచయంలేని కాలంనాటిదీకథ. పురూరవాది చక్రవర్తులు; కులవృద్ధులైన ఋషులు— భృగు. బృహస్పతి. గౌతమాదులు. ప్రజాతంతువును వృద్ధిపొందించారు. మానవజగత్తున కానాడు 'ఋషే' అధిపతి. ఆ ఋషే— కవి. ఆరాధకుడు. శాస్త్రవేత్త. ప్రవక్త. విద్యావేత్త. పండితుడు, శాసనకర్త కూడా. అతడు ఏదైనా రచిస్తే. ప్రజలకది పవిత్ర మంత్రమౌతుంది. అతడు భగవద్ధ్యాన సమాధిలోఉండి, ఉత్థానుడై "వాక్యోచ్చాటనం" చేస్తే. అది యుగాంతరాలలో తత్త్వశాస్త్రానికి అంకురమౌతుంది. అతడో యజ్ఞాన్ని నిర్వహిస్తాడు. రాజులు. ప్రజలు, అందులోని సప్తజిహ్వాగ్ని జ్వాలా మహిమచే. అపారసంపద్విలసితులు. మహాశక్తిసంపన్నులు. అవుతారు. అతడు పరిశోధనాత్మకంగా సూత్రరచన కావిస్తే. అది భవిష్యత్కాలములో నైతికశాస్త్ర నిర్మాణానికి పునాది ఔతుంది. అతడు వివాదంలో తీర్పునిస్తే— అదో శిక్షాస్మృతికో, శాసనానికో మూలమవుతుంది. హిమాలయారణ్యాలలోగాని; నదీనద సంగమ స్థానాల్లోగాని; అతడు గురుకులాలునిర్మించి కులపతియై నయనోజ్జ్వల కాంతిమూర్తులగు ఋషి పుత్రుల్ని; సాహసోపేతులగు యువజనాన్ని, భవిష్యత్కాలములో మహర్షులై. జాతికి మార్గదర్శకులు

కానున్న జ్ఞానార్థుల్ని సంఘటితపరచి, మహర్షులుగానో, కర్మవీరులుగానో, జ్ఞానులుగానో సుశిక్షితుల్ని చేస్తాడు. వీరి యనుబంధం, రక్తసంబంధమైంది కాదు కానీ, ఆదానప్రదానాలతో కూడిన భావసంబంధమైంది. ఆ ఋషి సత్తముడున్నూ, సకల కళాకోవిదుడు, వివిధశాస్త్ర నిష్ణాతుడు. ఋషులు తమ కఠోరైకాగ్రతచే సకలేంద్రియ శక్తుల్ని సమాహితం గావించుకొని, పవిత్రాంతఃకరణ ప్రవృత్తిచేత, సకల విజ్ఞానాన్ని కైవశం చేసుకోగలరు. అందువల్ల వారిలోని తర్కాతీత విశద దార్శనికత ప్రబుద్ధమౌతుంది. ఆంతరంగిక ప్రబోధంచేత ప్రవర్తితమయ్యే ఈ దార్శనికతా పునః పునః ప్రసారకాంతులు మహా తార్కిక భావతరంగ మాలగా రూపొందుతుంది. ఈ తార్కిక కుశలత కేవలం ఆలోచనకు, వాదప్రతివాదాలకు ఉపయుక్తమయ్యేదికాక, నిరంతరోత్తేజిత భావస్ఫూర్తి కుపకరించేది. పంచాగ్నులమధ్య వసించటం (నాలుగు వైపుల అగ్ని - పైని సూర్యుడు), శలాకాగ్ర శయ్యలపై రోజుల తరబడి శయనించటం; భౌతిక శాస్త్రీయ ప్రగతి పద్ధతుల్లో యోగాభ్యాసం చేయటం వంటి నిష్ఠుర భౌతిక నియమాలవలన శాశ్వతత్త్వాన్ని అన్వేషించటం ఆధునికాచారమైంది. పూర్వ ఋషులు ఉత్తేజిత భావుకులు. కేవలం తర్కంమీదగాని, భౌతికేంద్రియ నిగ్రహంమీదగాని ఆధారపడేవారుకారు. వారి ఆత్మీయత గంభీరమైంది. భగవద్ధ్యాననిమగ్నులై, తీవ్రప్రతిఘటనల్ని నిరోధిస్తు, వర్ణనాతీత ఆధ్యాత్మిక శక్తియుక్తుల్ని సముపార్జించుకొన్నారువారు. అందువల్ల వారి కోపాగ్ని ఎందరినో భస్మీభూతుల్ని చేయగల్గింది. శపింప సంకల్పించి వారు పెదవి విప్పితే, లోకాలోకాలు ఆకులమౌతాయి. ఇట్టిశక్తి, వారసత్వముగా తరువాతి తరాలకుకూడా సంప్రాప్తించింది. వారిసంతతిలో కొంతవరకు నిగూఢంగానైనా ఉంది. కాలపరిణామంలో యీ ఆంతరంగికతేజస్సు క్రమక్రమంగా క్షీణించింది. ప్రారంభంలో గర్భస్థశిశువుకు కూడా దివ్యత్వం ఉండేది. భృగుమహర్షికి 'పులోమ' అనే రాక్షస స్త్రీతో వివాహంకావటానికి

పూర్వం ఆమెనో రాక్షసుడికి ఇవ్వాలనుకొంటారు. కాని అలా జరుగలేదు. తరువాత భృగుమహర్షి యామెను పెండ్లాడాడు. చ్యవనుడు పులోమగర్భంలో ఉండగా, ఆ రక్కసుడు 'పులోముడు' ఆమెను మహర్షి లేని సమయంచూచి, వరాహరూపంలోవచ్చి అపహరిస్తాడు. అప్పుడు శిశువు చవనుడు, ఆ అవమానానికి బాధచెంది బహిర్గతుడై, సాంప్రదాయికంగా సంప్రాప్తమైన ఆధ్యాత్మిక శక్తిమహిమతో కోపించి, శపించగా, పులోముడు భస్మమైపోతాడు ఋషులు కేవలం అనుద్వేగులుకారు. వారికీ కోపతాపాలున్నాయి. జీవితంపై విశేషాభిమానం గల్గిన ధీశాలురు వారు. సౌందర్య తృష్ణతో రాక్షస స్త్రీలను వివాహమాడారు. అప్సరసలతో కొండకోనల్లో నిర్జనారణ్య సీమల్లో ప్రేమ డోలికల్లో ఏకాంతంగా విహరించారు. భృగు, బృహస్పతి, గౌతమ, కశ్యపాదులీ మహర్షుల కావిర్భవించినవారే. చరిత్రకందని కాలంనుండి యిప్పటి వరకున్న ఆర్యులు. ఈ పవిత్ర ఋషిసంవతివారే. తమకు నాగరికతను ప్రసాదించిన మూలపురుషులైన ఋషుల్ని, ఇప్పటికీ, నిత్యం భారతీయులు కృతజ్ఞతా భావంతో సంస్మరిస్తారు. వారికి దైవత్వాన్ని ఆపాదిస్తారు.

భూమిమీద ఋషులు, స్వర్గంలో దేవతలు, గొప్ప తేజోమూర్తులు. దుష్ట నిశాటుల విశృంఖల విహారభారంనుండి వీరు విశ్వాన్ని సంరక్షిస్తారు. సురాసురుల కవిరామంగా విరోధముంటున్నా, అప్పుడప్పుడు వీళ్ళు మైత్రీ భావంతో ఉండేవారు. ఇంద్రుని దేవేరి శచీదేవి పులోముడనే రాక్షసపుత్రియే. దైత్యారియైన యయాతి, దైత్యదుహిత శర్మిష్ఠను (వృషపర్వ మహాప్రభు పుత్రి) పరిణయమాడాడు. భృగుపత్ని పులోమది రాక్షసవంశమే. దేవతానాయకుడైన ఇంద్రుడు మేఘాధిపతి. యజ్ఞముఖాన మానవులు సమర్పించే సోమరసాన్ని ఆస్వాదించి, వర్షంకురిపిస్తాడు. గాలికి అధిపతి వాయుదేవుడు. హుతాశనుడు స్వాహాప్రాణనాథుడు, ఆధ్యాత్మిక శక్తిసంపన్నుడు. జలాధిపతి వరుణుడు. మృత్యుదేవత, కృతాన్తుడు. ఇతడే యముడు, అనగా ధార్మిక

పరిపాలకుడు, నైతిక వాస్తవిక ధర్మసంచాలకుడు. కాముడ్నే మదనుడని, మన్మథుడని అంటారు. ఇతడు శుకవాహనుడు, పుష్పశరుడు. భ్రమరశింజినీ వినాద ప్రమోదభరితుడు. సకల వాంఛల కధిపతి, రతీప్రియుడు. రతీదేవి స్వర్ణాంగి, అతిలోక సౌందర్యవతి, నిరంతర ప్రేమానందమయి. హైందవ వాగ్దేవత సరస్వతి. ప్రఫుల్ల భావస్వరూపిణి. అప్రకటిత నామరూపాత్మక జగత్తునకామె భావప్రకటనమే ఆధారం. ఎందుకంటే వాస్తవికతకు పూర్వమే వాక్కు ప్రవర్తిల్లింది. అందుచే వాస్తవికతకన్న వాక్కే సత్యమైంది, తాత్త్వికమైంది. సరస్వతి బ్రహ్మపుత్రి; తన తండ్రినుండి సృజనాత్మకశక్తిని సంతరించుకొన్నది. భర్తవలె లోకసంరక్షకురాలు లక్ష్మీదేవి. వాసుకి నాగ రాజు. భూభారాన్ని వహించే ఆదిశేషువు సహస్రశీర్షుడు. ఇతడు పరిమిత శక్తి. దేశకాలాలకు ప్రతినిధి. విరాట్‌స్వరూపుడు, విశ్వాకారుడునైన విష్ణు మూర్తికితని శరీరం మృదుశయ్య. దేవతలకన్న కొంచెం తక్కువస్థాయి లోనివారు దేవదూతలు. వీరి సేవకులు యక్షులు. వీరు, ధనాధిపతి కుబేరుని అపార ధనరాసుల్ని సదా సంరక్షిస్తుంటారు. సౌందర్య నిదానమైన అలకా పట్టణం కుబేరుని రాజధాని. స్వర్ణ తుషారావృత గిరులతోకూడిన ఈ నగరం దేవదూతాధిపతులకు ఆవాసం. భౌమికస్పర్శ నెరుగని చంద్ర కిరణావళిని చుంబించే సౌధరాజాలకిది ఆలవాలం. ఇంద్రనీలమణితోను, విదియనాటి చంద్రునితోను తుల్యంగా ప్రకాశిస్తుంది ఆ పురవాసుల ఫాలభాగం. వారికి ప్రేమతప్ప అన్యభావం పొడగట్టదు. వీరు నిత్య యౌవనులు; వయోవృద్ధి లేనివారు. వసంతంతప్ప అన్య ఋతువులు వారెరుగరు. గంధర్వులు మృదు మధుర మనోహర సౌందర్యమూర్తులేకాక, వీరోచిత స్వభావులు; కవులు, కళాకారులు, గాయకులుకూడా. కిన్నెరులాకాశ సంచారులు, గిరిశిఖర నివా సులు. సుకుమార గాత్రంతో రాళ్ళు కరిగేటట్లు గానంచేస్తారు. క్షీరసాగర సముద్భూతలు అప్సరసలు. స్వర్గధామంలో దేవతల్ని తమ అపూర్వ గీత

నృత్యాలతో అహరహం అలరింపచేస్తారు. వీరప్పుడప్పుడు మానవులతో ప్రేమకలాపాలు సాగిస్తారు. త్రివేణీసంగమ పరిపూత చరిత, ఆర్యజీవన ధాత్రి. పవిత్ర గంగానది విస్మరింపరానిది. భూలోకంలో దీనికి భగీరథి, జాహ్నవి అనికూడా వ్యవహారం. నాగరాజ్యంలోను; యమరాజ్యమైన మృత్యులోకంలో దీనికి భోగావతి, వైతరణి అని వ్యవహారం. వాగ్దేవి సరస్వతితో తుల్యనామంగల 'సరస్వతి' అనే స్రవంతి, గంగతో తుల్యమైన పావిత్ర్యంగలది. కాని దీని కూలాలు అనార్యజనావాసంచే అపవిత్రంకాగా, ఆర్యజనులు దీని నుపయోగించలేదు. అందుచే ఈ స్రవంతి అంతస్స్రవంతియై, ప్రయాగవద్ద గంగా యమునలతో సంగమించింది.

ఇట్టి యీ పరికరాలు ఉత్తమ కవితారచనకు యోగ్యమైనవి కావా? ఇట్టి వస్తుసముదాయాన్ని ఉపయోగించి, కళాకారుడు శాశ్వతకావ్య సౌందర్య దృశ్యాలు కల్పించలేడా? ఇవన్నీ అట్టి యోగ్యతగల కవితా వస్తువులేయని సంతోషపూర్వకంగా చాటగలను. భ్రాంతికాని, ఆత్మవంచనకాని ఆవంత కూడా లేదిందులో. ఏవంవిధ వస్తుసముదాయ మాధారంగా గతానుగతిక రచనలుకాక, వినూత్న కావ్యజాలాన్ని సృష్టించవచ్చు.

> "మానవుడ్ని ఉన్నతస్థాయిలో నిల్పి విజయోపేతుడ్ని గావించేది వాక్కు-ఈ వాక్ప్రసారం ఆత్మసంస్కారాన్ని కల్గించేదికాక, జగత్కల్యాణాన్ని సమకూర్చేది".

"ఇదంతా అంగీకరిస్తాను. కాని నా అభిరుచికి, మనోభీష్టానికి, విరుద్ధమైన గ్రంథాన్ని నేనెట్లా అంకితం చేసుకొంటాన"ని నీవు నన్ను ప్రశ్నించవచ్చు. కాని బహుమతి, పుచ్చుకొనేవానికన్న, ఇచ్చేవాని మనస్సు ననుసరించే వుంటుంది. నీకు నేను ఎంతకాలంనుండో వైజ్ఞానికంగా ఋణ

పడి వున్నాను. ఆ ఋణానికి కొంత చెల్లుబడిగా ఈ కావ్యాన్ని స్వీకరించగలవా? నీకు తెలీకుండానే, బాల్యంనుండి నాకెంతో బోధించి నేను కవిని కావాలని ఆకాంక్షించావు. ఎంతగానో ప్రోత్సహించేవాడివి. నీలోని విజ్ఞాన జ్యోతి, ఆత్మవిజ్ఞాన జ్యోతిని వెలిగించింది. నీవు చూపిన బాటలో తప్పటడుగులు వేసుకొంటు, అనిశ్చిత యాత్రను చిరకాలం సాగించాను. నేడు నేను అనివార్యమైన అభ్యుదయమార్గంలో స్వతంత్రంగా పయనిస్తున్నాను. బహుశః ఈ మార్గం, పూర్వపథంకన్న విశేషంగా కంటకావృతమైందే కావచ్చు, ఒడుదుడుకులతో కూడుకొన్నదే కావచ్చు. అయినా అది నా స్వకీయమార్గం. అంతమాత్రంచేత నీవు తొలుత చూపిన ఆదర్శజ్యోతిని విస్మరింపలేను. అందుచేత ఆ నా ఋణం తీరిందని భావించటంలేదు. నీ ప్రశాంత కాంతిపూరిత మేధాశక్తి, నీకు ఏనాటికైనా శాశ్వతకీర్తిని సంపాదించవచ్చు. ఆ కీర్తి దిక్చక్ర కాంతిలో నా పేరుకూడా చిన్న కిరణంగా ప్రకాశించనీ. నేను తొలిసారిగా రచించిన ఈ కావ్యం, నీ కంకితమైందనే విషయం నీ స్మృతి పథంలో ఉండటం నీ కంతగా హానికరం కాదనే అనుకొంటాను.

భారతావని

భారతదేశము తన ప్రాచీన భావములనే శక్తిమంతములైనవిగను, అన్యోన్యములైనవిగను, పూర్ణత్వము గలిగినవిగను వ్యక్తపరచ వలయుననిన తన స్వసంస్కృతీ రూపములకు నూతన ఆకారముల నొసంగి తనను తా రక్షించుకొనవలయును. అందుచే ఒకానొకప్పుడామె యీ సర్వ భూమండలమునకు మార్గదర్శియై, జ్ఞానదీప్తి నొసంగియున్నదగుటచే పునః తన ఆధ్యాత్మిక విజయ యాత్రయనెడి జ్యోతీతరంగములచే ప్రజ్వరిల్లి, దిగ్విజయముగ సర్వవ్యాప్తమై, సర్వ ప్రపంచమునకును విమోచన మొసంగగలదు.

* * *

వివిధములైన ఆటంకము లేర్పడుచున్నను భారతీయ సంస్కృతీ ప్రభావము, భారతీయ కేంద్రలక్ష్యము, తదున్నత భావములు, తమ సందేశమును వాక్కు భారతీయులకేగాక సకల మానవులకును అందించుచనే యున్నది.

—శ్రీ అరవిందులు

కళలలో జాతీయత

సౌందర్యోపాసనాదృష్టిని తిరస్కరించి, కేవల ప్రయోజనము నపేక్షించుచేపే యాధునిక విధానముగ నీ మధ్య మన దేశమునఁ బరిగణింపఁ బడెను. ఈ విధానమును యూరపు ఖండము తాననుభవించిన రసానుభవ శిక్షణమును, నూతన సంస్కృతీ సంప్రదాయ సంపదనుఁ బురస్కరించుకొని పరిహరించినది. భారతదేశమున కీ యనుభవము క్రొత్తదికాదు. చాల ప్రాచీనకాలముననే యీ దేశమునందు రసానుభవానందము పరాకాష్ఠము నధిష్ఠించినది. కాని యీ మధ్య పర పాలనముచేఁ బ్రవేశపెట్టబడి, ధన సముపార్జనా లక్ష్యసంవలితమైన నిర్జీవ విద్యావిధానముచే నీ ప్రాచీనసంప్రదాయములకు బ్రహ్మాండమగు నాఘాతమేర్పడినది. సౌందర్యోపాసనమునకు మారుగా నీ విద్యావిధానమందు విపరీతమగు నూహాశక్తి ప్రాబల్యము వహించినది. భావోద్రేకము పెల్లుబికినది. సుకుమార తత్త్వచింతనము మాత్రమే తల యెత్తినది. అయినను నీ సౌందర్యదృష్టి జాతి స్వభావమున నిగూఢమై యున్నదేకాని, రూపఱలేదు. అది భారతీయుల సుకృత విశేషము.

మన ప్రాచీనులు, సంగీతమునకు, శిల్పమునకు, కవిత్వమునకును ఎంత విలువనిచ్చిరో యీ కాలము వారి కర్థముకూడ కాదేమో!! అందులకు కారణము ఈ కాలమువారికి జీవితపరమార్థ మవగతము కాలేదు. కేవల భౌతిక సుఖానుభవమే వారికి సర్వోత్కృష్టముగ గోచరించును. భౌతిక విభూతి, మానవాభివృద్ధికి ప్రాతిపదికయే. ఏ జాతికైన తొలుదొల్త కడుపు నిండ తిండి, తలదాచుకొనుటకు నీడ, కట్టుకొనుటకు వస్త్రము లత్యంతావసరములే. ఇవి యేర్పడిననాఁడే జాతికొక యస్తిత్వమేర్పడును. ఈ సమస్యను మన ప్రాచీన సామ్యవాద మానవసంఘములు పరిష్కరించినవి. మానవ

జాతిలో ముప్పాతిక మువ్వీసము ఏతత్సమస్యా పరిష్కారమునకే పాటుబడు చున్నది. ఏ కొద్దిమంది బుద్ధిమంతులో దీని నతిక్రమించి యున్నతి నార్జించు టకు తహతహలాడుదురు. అత్యవసరమగు నీ సహజవాంఛలు, సర్వసాధారణమైనవి, పాశవికమైనవి, విపరీతమైనవి, విచక్షణా రహితమైనవి. ఇవి మనకును, పశుపక్ష్యాదులకును సమానమైనవి. దీనినే మన వేదాంతము 'ప్రాణమయకోశమ'ని వివరించినది. ఇట్టి అత్యవసర వాంఛల నాధారించు కొనియే, ధనపిపాస, భోగతృష్ణ, కామినీకాంక్ష లుద్భవించినవి. మానవేతర జాతులు కుక్షింభరత్వమునకే సతమతమగుచుండ మానవజాతి, నాగరికతోపేతమై, సుస్థిరమగు నార్థికవ్యవస్థను సాధించి, వ్యక్తిగతమగు నాస్తిపాస్తుల నార్జించినది. తన్మూలమున, సాంఘికమగు నసమానత్వము, నన్యాయము, దౌర్జన్యము, వంచన, పరస్పర విద్వేషము, వ్యక్తి సంబంధము, కుటుంబ సంబంధము, వర్గ సంబంధమునగు స్వార్థపరాయణత్వము చెలరేగి యివి యన్నియు మానవాభివృద్ధి కనివార్య మనిపించినవి. జగన్మాత సదసత్తు మూలమున జగత్క్రియను జరిపించును. క్షణికమగు నసత్తు మూలమున నామె జగత్కళ్యాణమును సమకూర్చును. పాశవిక మనఃప్రవృత్తు లీ రీతిగా కాలక్రమమున జగత్తు నుల్లోల కల్లోలిత మొనర్చినవి. రాగద్వేషములు, కామక్రోధములు మున్నగు ప్రాణసంబంధమగు నుద్రేకములు సామాజికముగా కాక, వైయక్తికముగ తృప్తిని సాధించుచుండెను. ఇట్టి యుద్రేక వాంఛలను దీర్చుటకే యాధునిక జాతులు, సంఘములు, ప్రపంచమున మను చున్నవి. అందులకే వర్తక వ్యాపారములు దినదినాభివృద్ధి నందుచున్నవి. భౌతికశాస్త్రములుకూడ మానవజాతికి సౌఖ్యమును, భోగసంపదను సమకూర్చుటకే పరిశోధింపఁబడుచున్నవి. ఇట్టి వాంఛా పరిసమాప్తికే వ్యక్తిగత సంపదలు, బానిస విధానము నమలులోనికి వచ్చినవి. ఇట్టి భౌతికేచ్ఛా సంతుష్టియే జాతులకు జాతులకు సన్నిహితత్వము నేర్పఱచుచున్నవి. ఈ

యిచ్చొ పరిసమాప్తి విశ్వతోముఖముగ సిద్ధింపనిచో ప్రపంచ రాజ్యములందు విప్లవములు చెలరేగును.

బానిసవిధానము మధ్యయుగములందు పరిహరింపఁబడినది. ఏలయన మానవహృదయశక్తి ప్రవర్ధమానమైనది. నైతిక, మత, వేదాంత ప్రభావము వ్యక్తిని, జాతిని అతిక్రమించి సర్వమానవసృష్టి నలముకొన్నది. అందుచే బానిసవిధాన స్థానమునందు కూలీ పద్ధతి వచ్చినది. తన్మూలమున మానవు లైచ్ఛికముగా బానిసతనమును వలచి, యుదరపోషణము గావించుకొను చుండిరి. ఈ విధానముకూడా క్రమముగా నీరసింపఁజొచ్చినది. సర్వమానవ జాతియు నేఁడు ఉదరపోషణముతోఁ దృప్తిజెందక. అనఁగా అన్నమయ కోశము నతిక్రమించి ప్రాణమయ, మనోమయ కోశములందు యధేచ్ఛగా సంచరింపవలయునని యుత్కంఠించుచున్నది. ఉత్తమవర్గమునకుఁ జెందిన కతిపయ మానవులు నిత్యజీవితము లందనుభవించు భోగభాగ్యములను తామును ననుభవింపవలయునని, సర్వమానవులును నేఁడాకాంక్షించు చున్నారు. ఇవియేకాదు; జాతీయ సౌభాగ్యమును, ప్రభుత్వమును, యుద్ధ నీతులను, రాజలాంఛనములను, దాముకూడ పంచుకొనవలయునని సర్వ మానవులు పటుపట్టినారు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, స్వాతంత్ర్యము—సమానత్వమను రెండింటికి సామరస్యముగూర్చి సాధ్యమైనంతవఱకు ప్రజల కందఱకు నందుబాటునకుఁ దీసికొనిరావలయును అను నుద్యమము సర్వత్ర సాగినది. ఇట్టి యాశయమే రక్తపాతసహితమై ఫ్రెంచివిప్లవముగా రూపొందినది. ఈ ప్రజాస్వామ్యమును, ఈ సామ్యవాదమును, ఈ యరాజ కమును నెదుర్కొనుటకు ధనికోన్నతవర్గము సర్వశక్తుల ప్రయత్నించినది. తాత్కాలికముగ కొంత యవరోధము కలిగినది. కాని కాలప్రవాహము నరి కట్ట నేరి సాధ్యము? భూతకాలముకన్న భవిష్యత్కాలము శక్తిమంతమైనది. పరిణామ పరిభ్రమణ మప్రతిహతముగ సాగును. దాని సంచాలనము నడ్డ గించునవన్నియు నందే హతమై తీరును. దానితోఁ బోరాడుటన్న భగవం

తుని సంకల్పము నెదుర్కొనుటయే; భగవచ్ఛాసనమును దిరస్కరించుటే. కారణజగత్తులో నితఃపూర్వమే యిట్టి దుష్టశక్తులు పరాజయ మందినవి. "నిహతాః పూర్వమేవ" బాహ్యజగత్తున వాని కార్యరూపమును మాత్రమే సందర్శింతుము.

సర్వసాధారణమగు మానవకోటి యిట్టి భౌతికవాంఛల నతిక్రమింప లేదు. దాని భావనకూడ నీ భౌతికస్థాయి నధిగమించదు. హిందూతత్త్వ మిట్టి యావరణనే 'మనోమయ కోశమ'ని పేర్కొన్నది. సర్వమానవ సామాన్యము, కతిపయ జీవజాలము నీ కోశమునుండి తమ సమస్త వ్యవహారములను నపరించుకొనును. ఇట్టి మనోమయ కోశము నతిక్రమించి మానవునకు బుద్ధి, లేక భావన యనునది కలదు. ఇట్టి బుద్ధిని పరిశుద్ధ మొనర్చుకొన్నచో అది మనోదేహముల నతకరించి స్వతంత్రముగ వర్తించును. ఉద్రేకములన్నియు శాంతి వహించును. కొలది మంది మనుష్యులు మాత్రమే యీ బుద్ధియను నింద్రియము నభివృద్ధిఁ గావించుకొనఁగలరు. అందును కొలదిమందియే దానిని పరిశుద్ధమొనర్చుకోగల సమర్థత కలిగి యుందురు. ఘనమైన యోచనాశక్తిగలవారు, కొన్నిగంటల పరిమితివఱకును భౌతికావరణమును కొంతవఱకు నతిక్రమించి, యీ బుద్ధీంద్రియమును స్వతంత్రముగ వినియోగించుకొనఁగలరు. కాని యీ యల్పకాలమునందును వారి భావన యవిచ్ఛిన్నముగ సాగునని తలంపలేము. దైనందిన జీవిత నీరసభావము లీ పరిశుద్ధ భావస్రవంతి నడ్డగించుచునే యుండును. అయినను పరిణతులైన యోగులు కొందఱీ విశుద్ధబుద్ధితో సదా రమింపఁగలరు. ఈ విశుద్ధబుద్ధి చిత్తశుద్ధివలన సంక్రమించును. శాంతవికము, శక్తిమంతము, నుద్రేకపూరితము నగు ప్రాణమువలన నేర్పడిన చిత్తము సదా కల్లోలితమై యుండును. దానిని ప్రశాంతమొనర్చిన చిత్తశుద్ధి కల్గును. సామాన్య మానవుల బుద్ధి, భౌతికవాసనల నతిక్రమింపని మనస్సుతో నిండియుండును.

మానవజాతిలో నధికసంఖ్యాకులు యోజింప సమర్థులుకారు. వారికి కొన్ని యాలోచనలు మాత్రముండును. కొందఱు మాత్రమే యవ్యవస్థితముగఁ జింతింపఁగలరు. వీరు తమ వాంఛలను, యభిమానములను, కామోద్రేకములను, పూర్వపరిచయములను, రాగద్వేషములను జిందరవందర కలిపి, తమ భావనను కలగాపులగ మొనర్తురు. అతిస్వల్ప సంఖ్యాకులైన భావుకులు మాత్రమే యచంచలమగు నాంతరదృష్టితో తమ ధీశక్తిని ప్రదర్శింతురు. వీరే నిజమైన నిరంకుశులు. వీరి నిరంకుశత్వము భౌతిక సంబంధమైనది కాదు. అభిజాత్యమునకు సంబంధించినది కాదు. ధనమదాంధతచే సంక్రమించినదికాదు. తీవ్రోద్రేకబలము వలనగాని, పదవీవ్యామోహము చేతగాని యేర్పడలేదు. ఇది కేవలము విజ్ఞాన సంబంధమగు నిరంకుశత్వము. ఏ కాలమునందైన నిట్టి నిరంకుశవాదు లుద్బుద్ధమౌదురు. మానవసమాజమున నీ యసమానత్వ మఖండమగు ప్రాముఖ్యమును బడయకతప్పదు.

బుద్ధి నతిక్రమించియు కొన్ని యితరశక్తులు కలవు. వాని నన్నింటిని కలిపి మనము స్థూలముగ నాధ్యాత్మికత్వమని వ్యవహరింతుము. ఇట్టి శక్తులు గలవారు కోటికొక్కరు గానవత్తురు. బుద్ధిమంతులుగాఁ బరిగణింపబడువారిలోగూడ నీ శక్తులు సమగ్రముగ వికసింపవు. మేధాకుశలతను, భావనాపటుత్వమును, ఉద్రేక తీవ్రతనే యనేకు లాధ్యాత్మిక సంపదయని భ్రమింతురు. ఆధ్యాత్మికత తదతీతమైనది. అయ్యును వీని నన్నింటి నంతర్భుక్తము గావించుకొన్నది. ఇది సర్వసృష్టికిని కారణభూతమైనది. దానిని సముపార్జించుటయే మానవ చరమలక్ష్యము. ఇట్టి ఆధ్యాత్మికార్ణవ తరంగములు కతిపయ మానవ హృదయ క్షేత్రముల యందనేక పర్యాయములు తరంగితమైనవి. అట్లగుటలో గల లక్ష్యము, తక్కిన మానవజాతికి చైతన్యమునుఁ బ్రసాదించి, శాంతచిత్తులను గావించుటయే!! దీనినే మతమని సాధారణముగ వ్యవహరింతుము. ఇట్టి స్థితికి పూర్వము బుద్ధిసంపదయే

మానవుఁడు సాధింపవలసినదానిలో సర్వోత్కృష్టమైనది. ఇట్టి బుద్ధిబలము చేతనే ప్రాచీన మానవసమాజము ఛేదించినది. ఇట్టి బుద్ధికి ద్విముఖములు గలవు. ఒకటి హేతుపూర్వకబుద్ధి లేక నిర్ణాయకబుద్ధి. రెండవది భావనాత్మక బుద్ధి. ఈ ద్విముఖ బుద్ధివికాసముచేతనే సమగ్రయోజన సిద్ధించును. శాస్త్ర· వేదాంత. విమర్శనాదులచేతను, కవిత్వాది కళాదర్శములచేతను, ప్రాచీన మానవసమాజము తలమున్కలైనది. అట్టి సమాజమున కిప్పుడు పతనము సంభవించినది. నూతన మానవవ్యవస్థకు శంకుస్థాపనము జరుగుచున్నది. శాస్త్రాదులు మానవులకు సౌఖ్యసౌకర్యములను గల్పించుటకై వినియుక్తమగు చున్నవి. సర్వప్రపంచ మానవులు నిట్టి భోగతృష్ణాపరాయణులై యఱ్ఱులు సాచుచున్నారు. సూక్ష్మసుకుమార గభీరములగు కళావిషయములుకూడ సర్వ మానవ మానసవీధులలో నస్పష్టముగను, నగమ్యముగను నేడు పరి భ్రమించుచున్నవి.

-: 2 :-

మానవబుద్ధి ద్వివిధములని పేర్కొంటిని ఇందొక్కొక్కటి యొక్కొక్కవిధమగు కార్యకలాపమును నెఱవేర్చును. ఇందు మొదటిబుద్ధి సృజనాత్మకమైనది. భావనాశక్తి గలది. ఏకాగ్రత కలది. సత్యసందర్శన మునకిది కేంద్రస్థానము. ఇక రెండవబుద్ధి విమర్శన, వివేచన, గవేషణ· హేతుపరిశీలనమను గుణములుకలది. తొలిబుద్ధిచే సందర్శితమైన సత్యమును మలిబుద్ధిచేఁ బరామర్శించి, సాకల్యముగ గ్రహింపనగును. నేటి విద్యావిధా నమునం దీ మలిబుద్ధికి సంబంధించిన కార్యములు శాస్త్రపఠనము మూలము నను, నింద్రియశిక్షణము మూలముననను సిద్ధింపఁజేయుటకుఁ బ్రయత్నింపఁ బడుచున్నది. తొలిబుద్ధికి సంబంధించిన కార్యములలో నొక్క యేకాగ్రతకు మాత్రము కొంత ప్రోత్సాహము కలదు. ఈ కారణముచే కేవల శాస్త్రీయ విద్య. బుద్ధిని నిశితమొనర్చి, కొంత పరిమితిలోఁ బరిశుద్ధము గావించును గాని, యది సంకుచితము. కఠినము మాత్రమేకాక, ప్రమాదభూయిష్ఠము

గూడ. సృజనాత్మకబుద్ధిని సుశిక్షిత మొనర్చుకొనని వ్యక్తి, యొకే యొక స్థానమునుండి యభివృద్ధి గాంచునేగాని సర్వతోముఖ మానవ సంస్కృతీ వికాసము ననుభవింపఁ జాలడు. అంతేకాదు. శాస్త్రదృష్టినికూడ విస్తృత మొనర్చుకొనలేడు. టెనిసన్ కవి తన దృష్టి ప్రకృతి పరిశీలనమునందు సుశిక్షితమైనదని, కాని తాను తత్త్వతః అల్పుడనని యొకచో పేర్కొనెను. ఈ వర్ణన మాతనిపట్ల సమంజసము. సుశిక్షితమైన తత్త్వములేనిదే, సుశిక్షితమైన దృష్టివలన మానవున కుత్కృష్టత సిద్ధింపదు. తత్త్వమథనమే విస్తృత విద్యావిధాన చరమలక్ష్యము. ఇట్టి తత్త్వమథనమున కత్యంతోపయోగకరములైనవి—భాష, వాఙ్మయము, సంగీత, చిత్రలేఖన శిల్పాదులైన కళలు, వేదాంతము, మతము, చరిత్ర మున్నగునవి. మానవ స్వభావస్వరూపములను కవీశ్వరుల కావ్యదర్పణములందు సందర్శించవలయును. ప్రకృతిని మానవుని తులనాత్మకముగ సమీక్షింపవలయును. ఇదియంతయు సృజనాత్మక బుద్ధికిఁ జెందిన కార్యకలాపమే. దీని ప్రాముఖ్యమును గుర్తించినను కవిత్వాది లలితకళలు సామాన్య మానవున కవసరములేనివనియు, నిత్య జీవితమున నిరుపయోగకరములనియు, ధనవంతులకు, భోగపరాయణులకు కాలక్షేపమునకు మాత్రమే వినియోగపడుననియు తలంచుట సర్వసాధారణమైనది. ఇట్లు భావించుటకు హేతువు భోగలాలసులైన యే కొలదిమందియో, ప్రపంచాధిపత్యమును బడసి, సర్వకళలను తమ హస్తగత మొనర్చుకొని దుర్వినియోగ పఱచిరి. ఇది మానవాభ్యుదయ మధ్యకాలమున జరిగిన విషయము. కాని రసానందానుభవ మే కొలదిమందియో, గుత్తకుఁగొన్నది కాదు. ఇది మానవజాతికి స్వతస్సిద్ధము. నిత్యజీవితానుభవము లోనిది. సౌందర్యోపాసనము మానవున కుగ్గుపాలతో నలవడిన విద్య. సహజవాంఛా పరిసమాప్తియందు, నరనారీ ప్రేమకలాపమునందు, భోజనభాజనములందు, వస్తువాహన వినియోగమునందు, నీ సౌందిర్యార్చనమే మానవుని పశువు

నుండి వేఱుపఱచి, యున్నతిని గల్గించినది. నాగరకుని గావించినది. ఉద్రేకములకొక ప్రశాంతస్థితిని చేకూర్చినది. భావనాశక్తిని వృద్ధిపరచి, మేధావిని గావించినది. ఇట్టి యౌన్నత్యమును బ్రసాదించిన యీ సాధనమును మానవుడు విస్మరించినచో, పతితుఁడౌను. కేవల మేధాసమృద్ధినే సముపార్జించి, శాస్త్రీయ పరిజ్ఞానమునే త్రవ్వి తలకెత్తించుకొన్నవానికి, సర్వప్రపంచమునూడిగము చేసిన చేయవచ్చును. కాని హృదయశక్తి, తత్త్వజ్ఞానము వృద్ధిఁ జెందనిచో మానవుఁ డసురాధముడే యగును. పూర్వకాలమున, 'అట్లాన్టిస్' నాగరికతా స్వభావముకూడ నిట్టి యసుర సంబంధమైనదే. ఈ నాగరికతా వైభవముతోపాటు దౌష్ట్యముకూడ మిన్నుముట్టి, యత్యుత్కటమై భరింప నశక్యమైనపుడు, మూలమట్టముగా సాగరగర్భమున నిది లీనమైనది, భారతదేశ పురాణగాధల ననుసరించి, యసురుల వైభవము నిట్టిదే. దానికి కూడ నట్టి దుర్గతియే పట్టుటకు కారణము విపరీత మేధా విజృంభణమే.

కళాప్రయోజనములలో ప్రధమమైనది రసానందము. ద్వితీయము మేధోద్దీపకము. తృతీయ మత్యుత్తమమగు నాధ్యాత్మిక వికాసము. రసానంద మప్రధానమని దీని తాత్పర్యముకాదు. తులనాత్మకముగ ప్రయోజనములను పరీక్షించినపుడది సామాన్యమనక తప్పదు. అయినను, రసానందానుభవము కల్గినపుడే మానవునకు కళాసంబంధమైన ఉత్తరోత్తరమగు నుత్కృష్ట ప్రయోజనములు సిద్ధించును. విషాదాంత గాధలయందీ యనుభవ తీవ్రత యధికము. ఇది మనస్సును క్షాళనమొనర్చును. అందుచేతనే యీ విషాదాంతగాథలకు "అరిస్టాటిల్" అధిక ప్రాముఖ్యమిచ్చెను.

వీని ప్రభావమును "కెథారిసిస్" అను ప్రాచీన గ్రీకు తంత్రముల యందలి పవిత్రపదముచే నీతడు వర్ణించెను. దీనిని మన ప్రాచ్యులు "చిత్తశుద్ధి" యని పేర్కొనిరి. సంకల్ప, వికల్పాత్మకమైన దీ చిత్తము. బహు

జన్మవాసనా సంయుతమైనది. బహు ముఖీనములగు భావానుభవ విలసిత మైనది, కవిత్వమందలి భావవిశిష్టతచే చిత్తవికారోద్రేకములు శాంతించునని యరిస్టాటిల్ అభిప్రాయము. ఇది కేవల కవిత్వమునకేకాక లలితకళల కన్నింటికిని విశాలముగ నన్వయించుకొననగును. కళాసంబంధమగు సౌంద ర్యము చిత్తవికారములను శాంతింపఁజేయును. సౌందర్యము, సత్యము భిన్నమైనవి. మన వేదాంతము ననుసరించి యీ సమస్త ప్రపంచ మానం దములో నావిర్భవించి, యానందమునందే జీవించి, యానందములోనే పర్య వసన్నమగుచున్నది. ఆనంద స్వరూపమును వర్ణించు త్రిపదము— ప్రేమా నందసౌందర్యములు, అఖిల ప్రపంచము—అనగా మానవ, మానవేతర ప్రకృతి, జీవితమునందు దివ్యసౌందర్యమును సమీక్షించుచు, నేవంవిందృశ్య మానాంశములను ప్రేమించుచు, నిష్కళంకమగు నానందము ననుభవించుటే జీవిత తరుణోపాయము, సమస్త మానవకోటియు సమష్టిగా భగవానుని సమీపించుటకు సులభ సోపానమీ సౌందర్యోపాసనమే. అవిద్యనుండి విద్య కధిగమించు మార్గమిదే. అవిద్యయనగా మాయాసంవలితమగు ప్రపంచము; ఇది భగవంతుని కళాసామ్రాజ్యము. విద్యయనగా నిర్వికార, నిరంజనమగు పరిశుద్ధ చైతన్యశక్తి. "అవిద్యయా మృత్యుధతీర్త్వా, విద్యయా అమృత మశ్నుతే" యనికదా యుపనిషద్వాణీ ప్రబోధము.

ఆనందమునుగూర్చి ప్రస్తావించుచుంటిమి. ఈ యానందము నిర్మల ముగా నుండవలయును. స్వకీయోద్రేకములు, బాధాపమానములు దీనిని కళంకిత మొనర్పరాదు. సత్యాసత్యభావన, సౌందర్యాసౌందర్య జ్ఞానము మన యాలోచనను, ఇంద్రియములను బాధించును. తద్బాధా నివారణమునకై యఖండ రస సాక్షాత్కారమును గావించుకొనవలయును. తన్మూలమున మనము మన చరమలక్ష్యమును సులభముగా నందుకొనగలము. ఇట్టి యఖండ రస సాక్షాత్కార మొక్కమారుగా లభింపదు. ఖండ సౌందర్య

సమీక్ష నలవఱచుకొని, క్రమక్రమముగా నఖండ సౌందర్య సందర్శనా సామర్ధ్యమును సంపాదింపవలయును. ఖండము నఖండము చేతను, క్షుద్రము నక్షుద్రముచేతను, అధమము నుత్తమముచేతను బూరించుకొనుచు దీనిని సాధింపవలయును.

మానవత్వాభివృద్ధి యందొకానొక దశలో ఈ రస పరిజ్ఞానమున కనంతమగు విలువగలదు. ఇది మానవప్రవర్తనను సరిదిద్దును. అనాగరక మగు వాంఛలయందు, కామోద్రేకములయందు హేయభావమును గల్గించును. విపరీత చర్యలను పరిమిత మొనర్చును. అనుభవమును, నడతను నాజూకుపఱచును. విజ్ఞానాత్మకమగు యూరోపియన్ సంఘ మిట్టి స్థాయి నందుకొన్నది. కాన్ఫ్యూషియన్ మత విధానమునందిట్టి యాలంకారిక జీవితము గోచరించును. హైందవమతమునందలి పవిత్రాచార ప్రవర్తనా పద్ధతి కూడ నిట్టిదియే, కాని రాను రాను నీ యాచారవ్యవహారములు బాహ్యాడంబరములుగా మారినవి; నిర్జీవములైనవి. ఇవి యుత్తమస్థితికి నూతగాకాక, యధమస్థితికిగూడ కారణభూతమగుచున్నవి. రసానంద పరిప్లావితమైనపుడు పాశవిక సహజాతములుకూడ సుశిక్షితములై యుత్తమస్థితి కుపయుక్తమగును. దీనివలన కల్గు నష్టమేమన నిది యాధ్యాత్మికానుభూతి కొక్కొక్క సమయమున నవరోధము కలిగించును. సహజ సౌందర్యాసక్తి క్రమక్రమముగ బాహ్యరూప వ్యసనముగ పరిణమించును. అది యొక నిర్జీవమగు స్వామ్యమగును. అందుచే నీ విధానమునకు భవిష్యత్కాలమున, విశేష ప్రాముఖ్యముండదు. దీని యవధులను గుర్తించి, ఉన్నత సత్యార్హతను, దాని యాధికారిక వాంఛలను గమనించి, ఋజుత్వమునకును, భావానుభవ స్వాతంత్ర్యమునకుఁ దగు ప్రాముఖ్యము నొసగవలయును. మానవుడు భూతకాలమున తాను సాధించిన యభివృద్ధినే యంటిపెట్టుకుని సంచరించుట కలవాటుపడును. అట్టి యంధానుకరణమునం దాతడు తన లక్ష్యమునుగూడ

విస్మరించును. ఇది చాల ప్రమాదకరము. వ్యర్థనియమపాశములను ఛేదింప వలయును. ఏతత్కార్యమునకై తిరిగి సౌందర్యోపాసనమే శరణ్యము. ఇది యున్నతస్థాయిలో జరుగవలయును. అప్పుడే దుష్టఫలితములకు దారితీసిన క్షుద్ర సౌందర్యార్చనము సక్రమ ఫలితముల నొసంగును. జీవితమే యొక కళ. దాని సౌందర్యగభీరతలు ప్రతివ్యక్తికి సుబోధకము కావలయును. ఇట్టి జీవితకళ, తన్ను సదా సంస్కరించెడి ప్రేమ సద్భావములకు సపర్యలు సలుపవలయును.

3

బాహ్య రూపాభిమానము మూలముననుం, నియమయుత భావప్రకటనము వలనను, సక్రమ క్రియావిధానముచేతను మానవుడు తన ప్రవర్తనముఁ బవిత్రమొనర్చుకొనును. కళాదృష్టివలన మానవాళికిఁగల్గు ననేక ప్రయోజనములలో నిది యత్యంత సామాన్యమైనది. అయినను నీ ప్రయోజన మత్యంత విస్తృతమైనది. ప్రముఖము, ననివార్యము నైనదికూడ. మానవ నాగరికతాభివృద్ధి కిది ప్రాతిపదిక యననగును. ఇంతకన్న కళ చేకూర్పగల యధికతర ప్రయోజనము—నీతి నియమ పాలనమునకుఁ దగు శక్తిని ప్రసాదించుట. నిత్యజీవితములో మనకుగల నైతికపరిజ్ఞానము సౌందర్యదృష్టి వలన సిద్ధించినదే యనియు; మన ప్రవర్తనలోగల యవినీతి యేతద్దృష్టి రాహిత్యముచే నేర్పడినదన్న విషయము సాధారణముగా మనము గుర్తింప జాలము. కాని కొన్ని క్షుద్ర బాహ్య సంఘటనలనుబట్టి యీ విషయ మప్పుడపుడు మనకుఁ గనువిప్పు కల్గించును. అసహ్య వేదనాకరములగు విపరీత రక్తపాతములయందు, దుర్భర దురంత హింసాకృత్యములయందు, నపరిమిత భోగ లంపటత్వమునందు, మనకు గల్గు హేయభావమునకుగల కారణమీ యకలంక సౌందర్యదృష్టియే. గ్రీకులకిట్టి సౌందర్యదృష్టి కలదు. అది

నిత్య చైతన్యోల్లసితమైనది. ఉదాత్త నైతికస్థాయి నందుకొనలేని యితర దేశీయులందీ దృష్టి కేవల రసానందానుభవమునందే పరిమితమైనది. మానవునిలోగల ప్రబల సహజాతములలో దయ, జుగుప్స మున్నగునవి ముఖ్యమైనవి. జుగుప్సకు. ఘృణతకు భేదము కలదు. ఘృణతయనగా స్వార్థ సంకుచితత్వమును, హింసా స్వభావమును నేవగించుట. ఇట్టి యేవగింపు కల్గియుండుటనగా స్వభావమునందు దయాదాక్షిణ్యములు కల్గియుండుటని యర్థము. అందుచేతనే సంస్కృతమున నిర్ఘృణత యను పదమునకు కనికరము లేకుండుట యను నర్థము రూఢమైనది. దీనినిబట్టియే ఘృణపదము కృపకు పర్యాయమైనది.

అత్యుత్తమమగు నీతి రసార్ద్రమైనది. సౌందర్యోపాసనమే యీ నీతికి బలము. అట్లయినప్పుడే నీతిపథమునందెదురువచ్చి దుష్టశక్తుల దౌర్జన్యము నశింపగలదు. గ్రీకుల నైతికబలమిట్టిది. ఇది రసానందమందు పరిమితమైనది. గ్రీకుల నైతికభావన నాల్గు సోపానములుగా నున్నది. మొదటిది బాహ్యాలంకారము, రెండవది యౌచిత్యమును బురస్కరించుకొని సామాన్య ప్రవర్తనమందు కాననగు శాస్త్రీయాశాస్త్రీయాచారములు, మూడవది శాస్త్ర సమ్మతోచిత న్యాయము. ఇది సౌందర్యస్థాయికి మిక్కిలి దోహదమును కూర్చును. ఇక నాల్గవ సోపానము మహోత్కృష్ట సౌందర్యస్థితి. ఇదే చరమ నైతికస్థాయి. 'అరిస్టాటిల్' నైతికవిధానమునందు గోచరించు విలక్షణత యిట్టిదే. ఆతడు మనవలె పాపపుణ్యములను బరిగణించి, నీతిని నిర్ణయింపడు. అతని దృష్టి కేవలము సౌందర్య ప్రామాణ్యమునందు బద్ధమైనది. అమితము—అతిమితము, పరిమితము ననుమానములతో నాతడు నీతిని స్థిరీకరించును. కాని సౌందర్యస్థాయి ననుసరించి, గ్రీకుల జీవిత దృక్పథము సమగ్రమైనదికాదు. ఏలయన వీరి సౌందర్య పరిభావన విశాల భావసముజ్జ్వలము కాదు. వారి కళాదృష్టి బాహిరమైనదే. అందుల కవసర

మైన ప్రేమోద్విగ్నత వారిలోఁ గొఱతవడినది. భారతీయుల కట్లుకాదు. బృందావన శ్రీకృష్ణుడు శ్యామసుందరుడేకాదు; జగదేక సుందరుడగు భగవానుడుకూడ. ఇతడు నిరుపమ ప్రేమస్వరూపుడు. సంపూర్ణమగు ప్రేమ లేనిదే సంపూర్ణ సౌందర్యము మృగ్యము. సంపూర్ణ సౌందర్యము లేనిదే సమగ్రానందలబ్ధి యుండదు. సౌందర్య దృష్టి ప్రవర్తనకు పుష్టి నొసంగినను, నది ప్రవర్తనాపరిధినిగూడ నతిక్రమింపవలయును. అప్పుడే మానవోన్నత సాధ్యమగును. అట్లతిక్రమింపజాలక పోవుటచేతనే గ్రీకుల సౌందర్యార్చనవిచ్ఛిన్నమైనది. వారికేకాదు, సర్వమానవులకును నట్టి పరిస్థితి యందు సౌందర్యముపై నేవగింపు, తిరస్కృతి కల్గును. సత్యమునుఁ గేవల సౌందర్యపాశములచే బంధింపజాలము. అట్టి ప్రయత్నమునకు పూనుకొనిన నది బాహ్య రూపమునందాబద్ధమై నిర్జీవమగును. అప్పుడే దానికి వ్యతిరేకత తలనెత్తును. అట్టి విరక్తినుండి సంయమన జీవితవిధాన మారంభించును. యూరపుఖండమునందలి నీతిశాస్త్రమంతయు ద్వంద్వభావ వైరుధ్యమునం దభివృద్ధి నందినది. ఇందొకటి గ్రీకుల సౌందర్యభావన. రెండవది క్రైస్తవ సంయమన భావన. ఈ క్రైస్తవభావన మొక రీతిగా కృతక నియమపాలనము చేతను, మఱియొక రీతిగా ప్రేమ విరహిత నిష్ఠుర సంయమన స్వభావము చేతను భ్రష్టమైనది. తొలుత నీ క్రైస్తవభావన సద్గుణ పాలనము నాచరించు కొని, సౌందర్యదృష్టిని దోషదూషితము గావించినది. సత్య మెన్నటికిని సౌందర్యమునకు బానిస కానవసరములేదు. అయినను సత్యము సుందరము గను, నానందదాయకముగను నుండవలయును. సౌందర్యరహితమైన సత్యమునకు జగత్తున విశేషాదరము లభింపదు. ఆ కొఱత కొఱతయే. సద్గుణములను సద్గుణములకొఱకే యుపాసించిన ప్రయోజనము శూన్యము. వాని యాచరణమునం దానందలబ్ధి యుండవలయును. అది సౌందర్యము వలనగాని సమకూడదు, సౌందర్య తిరస్కృత సత్యోపాసన మభివృద్ధి కొర

కము కాదని వేరుగా జెప్పపనిలేదు. కావున సౌందర్యదృష్టి నధోగతి నుండి యూర్ధ్వగతికి; నైచ్యమునుండి యుదాత్తతకు; ఖండమునుండి యఖండమునకు మఱల్చుటకై మానవాళి సదా కృషి సల్పుచుండవలయును.

రసానంద కౌశలమువలన కల్గెడి తృతీయ ప్రయోజనము భావోద్రేకములను పూతమొనర్చుట. ఇది ప్రథమ, ద్వితీయ ప్రయోజనములకన్న నధికమైనది. అరిస్టాటిల్ పండితుడుకూడ నీ ప్రయోజనమునే విశేషముగా ప్రస్తుతించెను. భావోద్రేకముల మూలమున సౌఖ్యానుభూతి నందుటయే జీవిత కవితాగానము, ప్రవర్తనమును, క్రియాశక్తిని, లయాత్మకముగ దీర్చి దిద్దుటే జీవితకళ. రసానందానుభవముచే నుద్రేకములెట్లు ప్రశాంతివహించి పవిత్రములౌనో కొంత విచారించితిమి. ఇంతకన్నగూడ నీ యనుభవమునకు విశేషశక్తికలదు. అష్టరస ధునులు ప్రవహించు దివ్య కేదారము మానవజీవితము. పశువులయందును, పశుతుల్యులగు మానవులయందును నీ రస వాహినులున్నను, నివి వ్యర్థముగా నింకిపోవును. లేదా యింద్రియ సంతృప్తికి మాత్రమే యివి పనిచేయును. కొందఱిలో ఈ రసములు భావోద్రిక్త సంయుక్త నీతి జీవితానుభవములకుఁ గారణభూతములై హృదయసంతృప్తి నొసంగును. కాని యల్పసంఖ్యాకులైన కొందఱు పురుషోత్తములుమాత్రమే యీ రసానందానుభవముచే నూర్ధ్వగతినంది, మేధోద్దీపనము మూలమున, సత్య శివ సుందర మూర్తియు; సర్వవ్యాపకుడు, సర్వాతీతుడు, సృష్టి స్థితి లయ కారణభూతుడునగు నా యఖిల రసామృతమూర్తి యఖండ రసామృత భాండమందలి రసఘుళికల నాస్వాదింప శక్తి సముపార్జింతురు. మానవహృదయము తనకు తాను పనిచేయగలిగిన, నది జీవిత కవితామాధుర్యము ననుభవించును. కరుణాద్భుత భావవిశిష్టతలను జవిచూచును. ప్రేమ సౌందర్యానుభవములను, ప్రశాంతి సౌమనస్యములను, రౌద్ర భయానక వీరములను—జీవితమునందు, ప్రకృతియందునుగూడ యథేచ్ఛగా బడయ

గలదు. అయినను నిది యుత్తమోత్తమమగు ననుభూతికాదు. కాని పశుత్వముకన్న వేయిరెట్లు విశిష్టమైనది; శక్తిమంతమైనది. ఇది రసబంధురమగు బాహ్యాభివృద్ధి. అనేకులిట్టి యభ్యుదయమునే యాశింతురు. దానికొరకే శ్రమింతురు. ఈ యభివృద్ధి భౌతికేచ్ఛాప్రభావముచే నెప్పటికైన విచ్ఛిన్నము కావచ్చును. అయినను కవిత్వాది కళలు సాధించిన బ్రహ్మాండమగు ప్రథమ విజయమిదియే. ఇంతకన్న బృహత్తరమగు విజయమునుగూడ నీ కళలు సంపాదింపగలవు. ఈ కళలు, భౌతికేచ్ఛల నధఃకరించిన భావోద్రేకములను నిర్లిప్తముగా హృదయసంతుష్టికి, భావనాపరతంత్రతకు వినియుక్తమగునట్లు కావింపగలవు. అరిస్టాటిల్ పేర్కొనిన మానసిక క్షాళనమిదియే. ఇదియే చిత్తశుద్ధి. భారతీయులింతటితో విశ్రమింపలేదు. సమస్త ఆధ్యాత్మిక దివ్య శక్తుల సాధనకు నీ చిత్తశుద్ధి ప్రాతిపదిక. చిత్తశుద్ధి మూలమున నీ దివ్య శక్తుల నలవోకగా సాధింపనగును. 'యమ నియమవిధి నిషేధక్రమ శాసితమైన ధర్మకల్పము' చేత చిత్తశుద్ధిని సాధించుటకు 'శిక్షాక్రకచము' నోర్వవలయును. కాని కళోపాసనముచే నీ చిత్తశుద్ధి యనాయాసముగా లభించును. ఇదే కళావిశిష్టప్రయోజనము. కళాప్రచోదిత బృహత్తర ప్రయోజనములలో గొన్నింటిని మాత్రమే లక్షించి, కళలు జీవితమున కాలంకారికములేకాని, యనివార్యములు కావను భావన ప్రపంచమునందు ప్రబలినది. ఇది పొరపాటు.

4

ఇప్పుడు మన మసలు విషయమునకు వత్తము. జాతి పరిణామమునందు కళలకుగల స్థానమెట్టిది? విద్యావిధానమునందు, జాతీయజీవనమునందు వాని ప్రయోజనములెట్టివి? ఈ ప్రశ్నలకు సమాధానములు యోజింతము. ఇందు మొదటి ప్రశ్ననే యిట్లు మార్చనగును. సౌందర్యదృష్టివలన జాతీయ

జీవితమున కేమైన ప్రయోజనమున్నదా? యని. ఉన్నదని నిరాఘాటముగా పేర్కొననగును. ఇంతకుముందే వచింపబడినట్లు, జాతి గౌరవ ప్రతిష్ఠలను బరిపోషించు సాంఘిక సంస్కృతి, సంయమనప్రవర్తనము, భావ సౌకుమార్యము, సౌజన్యము మొదలుగాగల యనేక విషయములీ సౌందర్యదృష్టి వల ననే సంతరింపబడుచున్నవి. ఫ్రెంచివారు ప్రపంచ మన్ననల నందుకొన్నారన్నను, ఐరిష్‌వారు, ఉన్నతవర్గమునకు జెందిన ఆంగ్లేయులవలె గౌరవ భాజను లగుచున్నారన్నను, కారణము వారిలోగల కళాప్రీతియేగాని యన్యము కాదు. ఇట్టి కళాప్రీతి విరహితమైన జాతి యనేకవిధముల దుర్బలమైనదనక తప్పదు. సంస్కార విహీనుడైన యాంగ్లేయునిలోగల పాశవిక హింసాప్రవృత్తి, ప్రష్యా దేశీయునియందుగల యసహ్యకరమగు మూర్ఖత్వము, స్వార్థపరత్వము, ఆయా దేశములకు హాని కల్గించినవి. విదేశీయులతోడను, విహితులతోడను, వలసరాజ్యముల వారితోడను, స్వతంత్ర రాజ్యములవారితోడను సంబంధబాంధవ్యములను నిర్ణయించుకొనుపట్ల నీ జాతుల స్వభావము మొత్తముపై నపకారమే యొనర్చినది. యుగయుగాలుగా సౌజన్య సద్భావ విలసితుడై, సహజీవన సూత్రబద్ధుడై యుదాత్తముగ ప్రవర్తించెడి భారతీయుడు, స్వరాజ్యసాధనకు గావించిన సమరమున ఆంగ్లేయుల ప్రవర్తన మెంత కఠినముగా నుండెనో మన కందఱకును నెఱుకయే. రూప సౌందర్య పరిజ్ఞానమును, లయాన్విత ఋజుత్వమును, కళా సంస్కృతి ప్రబోధముచే జాతి కంతటికిని కల్గింపనగును. పైన పేర్కొన్నట్లు సౌందర్య లక్ష్యవిహీనులైన యాంగ్ల, ప్రష్యా దేశీయులు భావుకత లేని వారు. ఐరోపియనులందఱిలోను, వీరికి కవితా కళాపరిజ్ఞాన మత్యల్పము. దక్షిణజర్మనీయుడు, సంగీతకవిత్వాది లలిత కళోపాసనమునందు ముందంజ వేసినాడు. కెల్టు, నార్మనులలో మహాకవులవతరించిరి. ఆంగ్లేయులలో శిల్పు లల్పముగా గలరుకాని, వారును తమ యనాగరక లక్షణముల నతిక్రమింప

జాలనివారే!! లలితకళ లన్నింటిలో సంగీతము మిక్కిలి శక్తిమంతమైనది. ఏలయన నది యాపాత మధురమైనది. జీవుని సంపూర్ణముగ తనకుఁ గైవసము గావించుకొనునది. జీవుడు తా నిట్లగుచున్నాననికూడఁ దెలిసికొనజాలడు. ఇంగ్లాండు దేశమునందు నామకుడైన గాయకు డొక్కఁడుకూడ నావిర్భవింపకుండుటే యా దేశీయుల యనాగరకతకుఁ బ్రబల నిదర్శనము. ఇది గమనార్హమైన విషయము. 'ప్లాటో' మహాశయుడు తన "రిపబ్లిక్" అను గ్రంథమునందు, విద్యావిధానమున సంగీతమున కత్యంత ప్రాముఖ్యము నొసగవలయునని వాక్రుచ్చెను. ప్రజల శీలము, తా మలవాటుగా గ్రోలెడి సంగీతము ననుసరించియుండునని యాతని వాదము. చిత్రలేఖన, శిల్పాదుల కింతటి ప్రభావము లేదు. కాని సంగీతము తరువాతి స్థానము వీనిదే. సర్వేంద్రియములకు నయనము ప్రధానము. నయనేంద్రియ సంపాదితమైన జ్ఞానముద్ర మనఃఫలకముపై స్పష్టముగ పడును. అందుచే చిన్నతనము నుండియు, నయనేంద్రియములకు సౌందర్య సమీక్ష చేయగల దక్షత కల్గునట్లు శిక్షణ మొసగవలయును. అట్లొసగినచో ప్రకృతిలోగల సమైక్యత: వర్ణరంజనము, లయాన్వితత్వము సుబోధకమగును. క్రమముగా నీ లక్షణములే నిత్యజీవితమునందును నెలకొనును. లలితకళలవలనను సర్వతోముఖముగా సమకూడు మహాప్రయోజన మిదియే. ప్రాచీన గ్రీసు దేశమునందును: యూరపు ఖండ చరిత్రమందలి కొన్ని యుగములందును, జపాను దేశమునందును, ప్రాచీన భారతదేశమునందును, ప్రజలిట్టి కళానక్తిని, కళోపాసనాభిరతిని బహుముఖీనములుగాఁ బ్రకటించిరి. ప్రతి గృహమును నొక కళాప్రదర్శనశాల కావలయుననుట దుర్లభము. కాని దైనందిన కార్యకలాపము, నిత్యోపయుక్తమగు ప్రతి పరికరము కళాత్మకముగా నుండునట్లు చూచుకొనవలయును. అపుడు మన యాచరణలు, ఆలోచనలు, అనుభవములు నున్నతస్థాయినందుకొని, మన జీవితములను మధుమయ మొనర్చుటే కాక, యుదాత్త భావప్రఫుల్లము కావించును.

సౌందర్య వస్తు సమీక్షవలనను, నుత్తమ కళాసక్తివలనను భావో ద్రేకములకు సరసమగు గమనమేర్పడును. చిత్తశుద్ధినిగూర్చి యింతకుఁ బూర్వమే కొంత ముచ్చటించుకొంటిమి. కవితాకళ పరమప్రయోజన మీ చిత్తక్షాళనమే యనినాడు 'అరిస్టాటిల్'. క్షుద్ర సంకుచితోద్రేకముల నధఃక రించి, జీవితకాలమునకుఁ దోడ్పడు నెనిమిది రసములను నిస్సంగముగా నాస్వాదించిన చిత్తశుద్ధి కల్గునన్నాడాతడు. ఇట్టి విధానము చిత్రలేఖన శిల్పా దులయందుకూడ సుసాధ్యమే. అవి మఱియొకరీతిగా నిట్టి లక్ష్యమునకుఁ జేర్చును. శిల్పము, కవిత్వమువలె పనిచేయునుగాని, కవిత్వమునకున్న ప్రభావము దీనికి లేదు. కవిత్వమునకు లయాన్విత సంచలనము కలదు. శిల్ప మునకు కదలిక లేదు. అది స్థాణువు. ఒకే ప్రదేశమునం దొకే భావసంచా లము నది ప్రదర్శించును. అది దేశ కాలావధుల నతిక్రమింపఁజాలదు. అయినను నీ స్థాణుత్వ ప్రశాంతతలే శిల్పమునకుఁ బార్ధక్యమునుఁ బ్రతిపా దించుచున్నవి. కవిత్వము భావోద్రేకములను ప్రేరేచి, ప్రత్యేకానందమును ప్రసాదించును. శిల్ప ముద్రేకములను శాంతింపఁజేసి, సంయమనముతో గూడిన పరిమిత సంతృప్తియందే యానందము ననుభవింపఁజేయును. గ్రీకు దేశము శిల్పమునకు కాణాచి. వీరి కవిత్వమునందును నీ శిల్పమహిమ వ్యాపించినది. సంగీతము భావోద్రేకములను గాఢమొనర్చును, ఒండొంటికి సమైక్యతను గూర్చును. కావున పరస్పర విలక్షణ గుణోపేతములైన యీ సంగీత, శిల్ప, చిత్రలేఖన, కవిత్వము లాత్మసంబంధములైన యుత్తమ విద్యలు. ఆత్మగమనము నీ విద్యలు పూతమొనర్చి పరిరక్షించును. ఆత్మకు సంయమనశక్తిని, గాంభీర్యమును, సమైక్యతను నివి ప్రసాదించును. అందుచే నీ కళలను నిర్లక్ష్యము చేయరాదు. ఈ కళాప్రగతియే మానవ ప్రగతి. ఈ ప్రగతి మందగించినపుడుగాని, క్షీణించినపుడుగాని మానవు డింద్రియములకు బానిసయై, తత్సంబంధమగు సౌఖ్యసాధనమే పరమాశయ

ముగా భావించి సౌశీల్యమునుఁ గోల్పోవును. ఇవి సక్రమముగా వినియుక్తమైనచో, మానవుడు విద్యావంతుడు, సంస్కృతీ సంపన్నుడు, వినీతి వశంవదుడునై ప్రవర్తించును.

5

కళాప్రయోజనములలో ముఖ్యమైనది మేధోద్దీపనము. మేధాకార్యము ద్విముఖములుగా నుండునవియును, అందొకటి భావనాసంబంధము లేక సృజనాత్మకమైనదనియు; రెండవది విచక్షణాత్మకము లేక విమర్శనాత్మకమునైనదనియు నితఃపూర్వమే పేర్కొంటిమి. రెండవది వివిధ శాస్త్రావలోడనము వలన వృద్ధిపొందును. మొదటిది వివిధ కళోపాసనము మూలమునను, ప్రపంచమును సానుభూతితో సమీక్షించుట వలనను వృద్ధిపొందును. ఇట్టి కళోపాసనముచే బుద్ధి నిశితమౌను. స్వార్థ సంకుచిత స్వభావము నశించును. సూక్ష్మ సుకుమారమైన ప్రేరణాత్మకశక్తి పెంపొందును. పలువిధములగు భావముద్రలను మనఃఫలకముపై చిత్రించును. ఒక్క వీక్షణమాత్రముననే సమస్త జగత్కార్యగతిని విదితము చేయును. జగత్తును విచ్ఛేద దృష్టితోకాక, సమైక్యదృష్టితో సమీక్షింపగల దక్షత కల్గించును. పరుల మనోగతులతో, స్వకీయ మనోగతి నేకమొనర్చి సాకల్యమును సమకూర్చును. దయార్ద్రమగు నాంతరంగిక దృష్టిని ప్రబలము చేయును. కళ చాల సుకుమారము, సూక్ష్మమునైనది. తన్నందినవారు తనంత వారౌదురన్నట్లు కళ నుపాసించువారిని కళాధర్మము లావహించును. కళ కాంతాసమ్మితముగా నుపదేశించును. అట్టి యుపదేశము నవగతమొనర్చుట కలవడినబుద్ధి, నిత్యజీవితమార్గ నిహిత మహిత సత్యమును విమేషములో గుర్తింపగల్గును. శాస్త్రాభ్యాసము మూలమునను నిట్టి బుద్ధి నైశిత్యము సంక్రమించును. కాని దానికిని, దీనికిని విశేష తారతమ్యము కలదు. శాస్త్రము బాహ్యావిషయ పరి

జ్ఞానము మాత్రమే కల్గించును. అందును నది తన కనుకూల విషయము లందే ప్రసరించును. వ్యతిరేక విషయములందు చొరవ దానికి లేదు.

కళ అట్టిదికాదు. దాని కే జగత్తునను వ్యతిరేకతయే లేదు. అది సర్వమును రసమయ మొనర్పగల పరుసవేది వంటిది. సకల సృష్టిస్వరూప ముల, సమస్త ప్రకృతి స్వభావముల నామూల చూడముగ సాక్షాత్కరింప జేయునదీ కళ. నవనవోన్మేషమగు శక్తిప్రదాయిని, మనఃకవాటములఁ దెఱచి సృష్టికలాపమునకందు ప్రవేశము కలిగించును. మేధోద్దీపనము, హృదయ వికాసకారకమునగు నీ కళావిశిష్ట ప్రయోజనము నందఱునుఁ బూర్తిగా గుర్తించినట్లు కనుపించదు. మానవులు భాషనుఁ గల్పించిరి. కవిత లాలా పించిరి. చరిత్రలు లిఖించిరి. వేదాంతగోష్ఠులు గావించిరి. బుద్ధికిఁ బదును పెట్టిరి. కాని సంగీతము, చిత్రలేఖనము, శిల్పములకు గల వైజ్ఞానికపు విలువ నంతగా గుర్తించినవారు విశేషముగా కానరారు. కళలు మానవుల కైచ్ఛికములేకాని, యావశ్యకములు కావను భావము ప్రబలుటచే నీ కళ లే కొలదిమందికో మాత్రము నారాధనీయమైనవి. అయినను సౌందర్యమున కాకర్షితమౌట, రమణీయ గీతముల నాలకించుట, వర్ణరంజితమైన చిత్రము లను జిజ్ఞాసతో సమీక్షించుట మున్నగు లక్షణములు విశ్వజనీనముగా మాన వాళిని ప్రేరేచుచు వెన్నంటియే యున్నవి. మానవత్వమునకు దివ్యత్వము నాపాదింపగల కళారాధనా ప్రవృత్తికి దూరము కావలదని యీ యంతః ప్రేరణ మెప్పటికప్పుడు మానవుని హెచ్చరించుచునే యున్నది. కాని యీ హెచ్చరికను మానవుడు పెడచెవినిఁ బెట్టుచున్నాడు. ఈ యమూల్యమగు హెచ్చరిక నాలించి, యుత్సాహోల్లాసములతో సుశిక్షితమగు మార్గమున కళా రాధనము కావించుచు, దివ్యత్వము నార్జించుటకు యత్నింపక, క్షణికాడంబ రములకే కాలము సర్వము వ్యయించుచుండుట శోచనీయము. మానవ మేధానిహితమైన మహితశక్తిని వెలార్చుటయందు, భావోద్రిక్తతా విలాసము

నందు, బ్రహ్మానంద సబ్రహ్మచారి యయిన రసానంద రూపకమగు నానంద మును స్వాధీనపఱుచుటయందు, జీవితగమనమును దీర్చిదిద్దుటయందును నీ కళలకు గల స్థానమును మానవులు సక్రమముగాఁ దెలిసికొన్నచో, వారి పురోగమన మవిచ్ఛిన్నముగ సాగును. నేడు మానవులలో నధిక సంఖ్యాకు లందీ కళాసంబంధమగు ప్రేరణ లధమస్థితికి దిగజారుట మానవత్వ పతన మనియే భావింపక తప్పదు.

మేధా వికాస కారకమగు నీ ప్రయోజనముకన్న మిన్నయైన యత్యు త్తమ ప్రయోజన మొకదానిని కళ చేకూర్పగలదు. జాతి యందాధ్యాత్మిక వికాసమును గల్గించుటే యా పరమప్రయోజనము. కళలభివృద్ధిగాంచి మత ముతో నెట్టి యవినాభావ సంబంధమును బడసినవో యైరోపియన్ విమర్శ కులు వివరించిరి. ఇందు విప్రతిపత్తి యేమియులేదు. గ్రీసు, ఇటలీ, ఇండియా దేశములందు జాతీయ కళావికాసము, కళాప్రతిభ తత్తజ్జాతి మత చిహ్నములైన దేవాలయాదులను కళాత్మకముగాఁ దీర్చిదిద్దుటయందే ప్రద ర్శితమాయెను. కళకు, మతసంబంధమైన యిట్టి బాహ్యాకృతులకు గల సన్ని హితత్వమునుబట్టి యీ కళావికాసము కలుగలేదు. కాని మానవుల యాధ్యా త్మికాశయములన్నియు వారవలంబించు మతమునందు కేంద్రీకరింపబడినవి. ఆధ్యాత్మికత చాల విశాలమైనది. బాహిరమగు మతవిధానములే దాని యవ ధులు కావు. అట్టి యాధ్యాత్మికోన్నతిని సాధించుటకే కళావిష్కారము జరు గుట. కళాప్రయోజనములలో నత్యుత్తమము, దివ్యజ్ఞానము, దివ్యమగు ప్రేమానందములు, దివ్యశక్తి యను త్రివేణీసంగమమే యాధ్యాత్మికత. మానవు డీ యాధ్యాత్మిక శక్తిసాధనకే సదా యుత్కంఠించును. పాశ్చాత్యు లనుభవించెడి రసానందమును, సౌందర్యపరితృప్తిని, జీవితచిత్రణా పరిశీల నానందమును భావోద్రిక్త విభూతిని, యనుభవింపఁ జేయుటేకాక, కళ, తద తీతము, నాంతరంగికము నగు నాధ్యాత్మిక సత్యానుభూతిని ప్రసాదించును

అట్టి ఆంతరంగి కాధ్యాత్మికానుభూతియే విశ్వముఖమున విశ్వేర్వరు డనుభ వించు నానందము. అదే సృష్టియందు కాంచనగు దివ్యత్వము. ఇట్టి సర్వో త్తమ ప్రయోజన సంసద్ధికే భారతీయుడు కళ నుపాసించును. అట్లని సర్వ సాధారణముగ పాశ్చాత్య కళోపాసకులు ప్రాథమికముగా ననుభవించు రసా నందమునకీతడు దూరుడుకాడు. ఏతదనుభవానంతర మీతడదే తన చరమసీమ యని భ్రమింపక, దాని నధిగమించి, యుగయుగాలుగా, తన జాతికి కాణాచి యైన యాధ్యాత్మికానుభూతియందు రమించును. ఈ కారణము చేతనే ప్రాక్ప్రతీచీ కళాప్రయోజనములు భిన్నముగానున్నవి. ఇప్పుడిప్పుడే, కళా నిష్ణాతుడైన యైరోపీయను, ఆసియాఖండ కళా సంప్రదాయములను, సదా చారములను, నుత్తమోత్తమ లక్ష్యములను నవగాహనము గావించుకొనుట కారంభించినాడు. ఆసియా ఖండమునం దితోధికముగా జరుగుచున్న కళాభి వృద్ధిచే నీ ప్రాక్ప్రతీచీ కళా ప్రయోజనము లేకమై, యేకైక మహోన్నత పరమప్రయోజన సంసిద్ది కీ సకలజగత్తును యావచ్ఛక్తిని వినియోగించునని యాశింపనగును. రసానందానుభవ మాధ్యాత్మి కానందానుభవముగా పరిణ మించినపుడే యది చరితార్థమగును.

నిజముగా కళ కిట్టి సర్వోత్కృష్ట ప్రయోజనము సర్వత్ర సిద్ధింప వలయునన్న భారతీయ కళోపాసనా విధానమే ప్రాబల్యము వహింపవల యును. ఎచ్చోట సర్వ మానవకోటియు విశ్రమించునో, యచటినుండి భార తీయు డుపక్రమించి దుర్గమ శిఖరముల కెచ్చటికో చని, యందధిష్ఠించి తన యాత్మ నావిష్కరించును. అది మానవుని భగవంతునిగా మార్చగల దివ్య ప్రదేశము. భారతీయుని యీ మహాప్రస్థానమునందు ఆతని శారీరక, మాన సిక, హృదయప్రవృత్తులు సర్వము దివ్యత్వము నందును. సర్వమానవ జగత్తును నీ మహాప్రస్థానమున కుపక్రమించిన కళాప్రయోజనమును సమగ్ర ముగ సంపాదించునట్లౌను.

కలుషితమైన భౌతికసుఖముకన్న నన్ని విధముల మిన్నయైనది. సమగ్రము, అవికారము, సమస్తవస్తు శోభావహము. సర్వ సామాన్యమయ్యును సర్వోత్కృష్టము. నీచము, నసహ్యమయ్యును మహోదాత్త గంభీరమును, రమణీయ భయానకమగు నీ సృష్టిధర్మము సర్వులకును సద్గతి కల్గించుట, సర్వులను పవిత్రులను గావించుట, అందఱను సత్య శివ సుందరులనుగాఁ దీర్చిదిద్దుట. ఇట్టి సృష్టి కళామృతైక బిందు సంసేవన మాత్రముననే సర్వజీవనము, సర్వక్రియాశక్తియు దివ్యముగ పరివర్తించును. ఇక నీ యమృత సర్వస్వము నాస్వాదింపగల మానవుల యదృష్ట మెవరికిదృష్టము? వారే దేవతలన, సృష్టి కళకుగల యీ శక్తి సర్వమును ద్విగుణీకృతముగా కళాసృష్టి మూలమున పుణికి పుచ్చుకొనవచ్చును. మానవుడు సాగించెడి యాత నాయత జీవితయాత్రను, రసవత్తరమగు నానందయాత్రగాఁ బరివర్తింప జేయగల విన్నాణమీ కళాసృష్టికి గలదు. ఇట్టి జీవితయాత్ర కాధారమాధ్యాత్మికత్వము, ఇది విశ్వము నందంతటను నిండి నిబిడీకృతము. ఇదియే ప్రతి వ్యక్తికి, తన యనంత క్రియాకలాపము నందు, కష్టసుఖముల యందు చుక్కానిపట్టి, భవాబ్ధినుండి తరణోపాయమును జూపును. మానవ హృదయమునందు వాసనామాత్రముగానుండి, సమస్త విశ్వతలమునందుగల దివ్య స్వభావ బల వీర్యములను; ప్రశాంతతోద్రిక్తతలను, నాకర్షణోత్సాహములను సంపూర్తిగా మానవాత్మకు సంప్రాప్తింపఁజేసి పరిమితావరణ బద్ధుడగు వాని ననంతమునందు విలీన మొనర్చుటయను మహత్తరాధ్యాత్మిక ప్రయోజనమే కళవలన ప్రాపణీయమగు పరాకాష్ట లాభలబ్ధి. అదియే సర్వతోముఖ కళావికాసము. అదియే దానికి గల యఖండ స్వామ్యము.

6

మానవ సంస్కృతీ పరిణామమునందు కళవలన గల్గు పరమ ప్రయోజనమునుగూర్చి కొంతవఱకు మాత్రమే ముచ్చటించుకొంటిమి. ఈ సందర్భముననే విద్యావిధానమునందు కళలకుగల స్థానమునుగూర్చి కూడా కొంత ప్రస్తావించితిమి. ప్రజాసంస్కృతీ సంపదకు నుత్తమ మానసిక శిక్షణమునకు నైతిక రసానందానుభవ నైపుణ్యమునకును గారణభూతమైన యిట్టి కళాసంపద నే దేశముగాని తృణీకరింప జాలదనుటలో విప్రతిపత్తి లేదు. కళాశిక్షణ మే కొలదిమంది నిపుణులకో సంబంధించిన స్వామ్యమని వేఱు చేయక, విద్యావిధానమునందును, సంస్కృతీ సంపాదనమునందును నొక యనివార్యమగు నంశము గావించవలయును. శాస్త్రములు, వాఙ్మయ పఠనము మున్నగువానికివలె నీ కళలకుగూడ సముచితమైన స్థానము నొసంగవలయును. అప్పుడే జాతీయ విద్యావ్యాప్తియందును, సర్వతోముఖ మానవ సంస్కృతీ ప్రచారమునందును నా దేశ మభ్యుదయ మార్గమున గమించుచున్నదని భావింపనగును. దీనినిబట్టి ప్రతి మానవుడును నొక కళాకారుడు కావలయునని యుద్దేశ్యముకాదు. కాని ప్రతి మానవుడు తనకు భగవద్దత్తమైన కళానైపుణ్యమును వృద్ధిగావించుకొన వలయుననుట తప్పుకాదుకదా!! తన కళాభిరుచిని ప్రతివ్యక్తియు సుశిక్షిత మొనర్చుకొనవలయును. తన సౌందర్యపిపాసను, తన రూపలాలసను, తన వర్ణరతిని, నిరంతరాభ్యాసముచే నిత్యజాగృతము, సునిశితము, సుశిక్షితము, విశదము నొనర్చుకొనుటాతని పరమధర్మము. గొప్పగనో, సామాన్యముగనో సృజింపగలవారికి, అసాధారణ ప్రతిభా విశేషసంపదచే నపూర్వ శిల్పమును సృష్టించువారికి లేదా మానవ నిత్యజీవితోపయోగ వస్తువులను నిర్మించువారికి తమ నిర్మాణ విధాన మవిచ్ఛిన్నముగ సాగునట్లు చూడవలయును. దేశీయులుకూడ వైకృతమునుగాక ప్రకృతిని నైచ్యమునుగాక యుదాత్తతను, గ్రామ్యమునుగాక

సంస్కారమును, విషమమునుగాక సమత్వమును సదా వాంఛించుట కలవాటు పడవలయును. ఏ జాతి తన నిత్య జీవితము నుదాత్త సౌందర్యావరణమునందే యుంచి, సమాహిత చిత్తముతో నట్టి సౌందర్యము నుపాసించునో, యా జాతి సంపూర్ణ కళాస్వరూపమును సాక్షాత్కరించుకొని, తాదాత్మ్యము నందును.

వంగదేశమునం దీ మధ్య నారంభింపబడిన జాతీయ విద్యాలయములందు చిత్రలేఖనము, మృత్తికా నిర్మాణము ప్రవేశపెట్టబడినవి. వానికి సముచితమగు ప్రాముఖ్యము నొసగబడినది. కాని సరియైన కళాలక్ష్యము కుదురలేదు. ప్రజానీకమునందు చేతిపనులనుగూర్చి విరసమగు భావములేర్పడినవి. జాతీయ విద్యాసంస్థ లార్థికముగ మిక్కిలి హీనస్థితిలోనున్నవి. కళలను, కళాదృష్టితోగాక, వ్యాపారదృష్టితోఁ జూచుట యెక్కువైనది. జాతీయతయని యెంత పరితపించినను, నాంగ్లభావ ప్రాబల్యము, ఆంగ్లేయ విధానములు, ఆంగ్లాభిరుచుల ప్రభావము, జాతీయవిద్య యనబడు నీ విధానము నారంభమునందే నిష్ప్రయోజన మొనర్చెను. విద్యార్థులలో స్వతస్సిద్ధమగు నైపుణ్యము లేకపోలేదు. కాని వారు పొందిన బోధనమా నైపుణ్యమును నిరుపయోగ మొనర్చినది. ఆంగ్లేయులు కేవల వ్యాపారదృష్టితో, కళావిహీనముగా గావించు ఉత్పత్తి ననుకరించి యీ విద్యాసంస్థలయందును వస్తుసామగ్రిని తయారుచేయవలయునన్న, దేశమునకుగాని, వ్యక్తికిగాని యెట్టి ప్రయోజనము నుండదు. స్వేచ్ఛాయుత చైతన్యముతో, క్రాంతదృష్టితో నొక రూపమును దర్శించి, సత్యస్వరూప పరిజ్ఞానముతో, స్వయంశిక్షణచే నేర్పడిన హస్తలాఘవముతో, నాత్మ ప్రేరణానుసారముగా దానికి వర్ణరంజితమగు రమణీయాకృతిని కల్పించిన కళాసృష్టిలో నుభయతారకత్వ మున్నది కాని, యేవో కొన్ని కొలతలను దీసికొని; మక్కికి మక్కి దింపమన్నచో, కళాసక్తి యే మాత్రము నభివృద్ధిగాంచదు. ఇట్టి యథార్థ రచన కేవలము

యాంత్రికము, లాంఛనప్రాయమునగు నాంగ్ల పద్ధతి. ఇది భావుకులగు భారతీయులకు నిష్ప్రయోజనము.

భారతదేశమునందు, నిజమైన జాతీయ కళాసముద్ధరణ మెప్పుడో ప్రారంభమైనది. ఇప్పటికే భారత జాతీయ సామాన్య కళాసృష్టి, విదేశీయో న్నత కళాఖండములను దలఁదన్నగలదనుటలో సందేహము లేదు. ఇట్టి పరిస్థితులలో నపరిష్కృతము సర్వసామాన్యము, నీరసమునగు కళాబోధన విధానమాంగ్ల పాఠశాలలలో కొనసాగుట క్షమింపరాని యపరాధము. ఆంగ్లే యుల నైచ్య వ్యాపారదృష్టి మనకేమాత్రమును విహితముకాదు. ఇంకను మన దేశమునందు సమంజసమగు జాతీయ విద్యావిధానము పరిణామము చెందవలయును. పాశ్చాత్య లక్ష్యములు, స్వభావ విరుద్ధమగు విదేశీయ పద్ధతులు మన మానసములనుండి పూర్తిగా క్షాళనముకావలయును. చివరకు తత్సంబంధమగు వాసనలుకూడ మనలో శేషింపరాదు. అందును విద్యా విధానమునందిట్టి భావదాస్య మేమాత్రము పనికిరాదు. సరియైన విద్యాబోధన మందే జాతి మానసిక, కళాపునరుజ్జీవన మాధారపడియున్నది. ప్రాచీన కళా తత్త్వము పునరుద్ధరింపబడవలయును. ప్రాచీన సంప్రదాయముల నిప్పటికిని పరిపోషించుచున్న కళాకారులలోగల సత్యదృష్టి, క్రాంతదర్శనము, ఋజు భావావేశము, నిసర్గ ప్రతిభాసంపద; జాతీయత, హస్తమాధుర్యము, నాంత రంగిక ప్రేరణానుకూలమైన దృష్టి నవనవోన్మేషముగా తిరిగి సంపాదింప వలయును. జాతియంతయు నువ్వెత్తుగా మఱల ప్రాచీన సంస్కృతీ విశాల కళాపీఠమునందు సుప్రతిష్ఠమగున ట్లుద్ధరింపఁ బడవలయును.

రురు-ప్రమద్వర

(శ్రీమదాంధ్ర మహాభారతము నుండి)

క॥ చ్యవనునకు సుకన్యకకు
ద్భవమయ్యె ఘనుండు ప్రమతి; ప్రమతికి నమృతో
ద్భవయగు ఘృతాచికిని భా
ర్గవ ముఖ్యుఁడు రురుఁడు పుట్టెఁ గాంతియుతుండై॥

వ॥ అట్టి రురుండను మునివరుండు, విశ్వావసుండను గంధర్వరాజునకు మేనకకుం బుట్టినదాని, స్థూలకేశుండను మహాముని నివాసంబునఁ బెరుగుచున్న దాని, రూపలావణ్య గుణంబులఁ బ్రమదా జనంబుల యందెల్ల నుత్కృష్ట యగుటంజేసి, 'ప్రమద్వర' యన నొప్పుచున్న కన్యక నతి స్నేహంబున వివాహంబుగా నిశ్చయించియున్నంత

తే॥ కన్నియలతోడ నాడుచు నున్నదానిఁ
బాద మర్దితమై యొక్క పన్నగంబు
గఱచెఁ, గన్నియలందఱు వెఱచి పఱచి
యఱచుచుండఁ, బ్రమద్వర యవనిఁ ద్రెళ్లె॥

వ॥ దాని నెఱింగి కరుణాకలిత హృదయులై గౌతమ, కణ్వ, కుత్స, కౌశిక, శంఖపాల, భరద్వాజ, వాలఖిల్యోద్దాలక, శ్వేతకేతు, మైత్రేయ, ప్రముఖులు ప్రమతియు రురుండును స్థూలకేశాశ్రమంబునకు వచ్చి విషవ్యపగతప్రాణయై పడియున్న యక్కన్యంజూచి దుఃఖితులై యుండ

నచ్చోట నుండనోపక రురుండు శోకవ్యాకుల హృదయుండై యేక
తంబ వనంబునకుం జని

చ॥ అలయక యేన దేవ యజనాధ్యయన వ్రత పుణ్యకర్మముల్
సలుపుదునేని; నేన గురు సద్ద్విజ భక్తుఁడనేని; నేన య
త్యలఘు తపస్వినేని; దివిజాధిప భూసురులార! మన్మనో
నిలయకు నీ ప్రమద్వరకు నిర్విషమయ్యెడు నేఁడు మీ దయన్॥

చ॥ అపరిమితాజ్ఞఁ జేసియు మహాపురుషుల్ విషతత్త్వ సంహితా
నిపుణులు మంత్ర తంత్రములు నేర్చి విధించియు దీనికిన్ విష
వ్యపగతమైన జీవమిది వచ్చు నుపాయము సేయరొక్కొ! నా
తపము ఫలంబు నధ్యయన దాన ఫలంబులు నిత్తు వారికిన్॥

వ॥ అని దీనవదనుండై యాక్రోశించువానికి, నాకాశంబుననుండి యొక్క
దేవదూత యిట్లనియె: "అయ్యా! కాలవశంబయిన నెవ్వరికిందీర్పఁ
దరంబుగాదు. ఒక్క యుపాయంబు గలదు. చేయనోపుదేనిఁ
జెప్పెద వినుము. నీ యాయుష్యంబు నం దర్ధం బిక్కన్యకిమ్ము" ఏన
రురుండట్ల చేయుదునని తన యాయుష్యంబునం దర్ధం బిక్క న్యక
కిచ్చిన నక్కోమలి దొల్లింటికంటె నధిక శృంగార సమన్వితయై విష
నిర్ముక్తయయ్యె. అట్లు దేవదూత ధర్మరాజానుమతంబునఁ దన
చెప్పిన యుపాయంబునం బ్రమద్వరను బంచత్వంబు వలనం బాపె.
రురుండునూ దాని వివాహంబై యిష్టోపభోగంబుల ననుభవించుచు
నుండి

శ్రీ అరవిందులు : భారతీయ కళ

శ్రీ అరవిందుల సాధన పరిపూర్ణ పద్మమువలె సర్వతోముఖమైనది. కనుకనే యా మహాత్ముని కర్మయోగిగా, కవిగా, వేదాంతిగా, కళాద్రష్టగా, ఋషిగా పూజించుచున్నాము. ఈతడు సర్వతోముఖమయిన తన సాధనా మాహాత్మ్యమువలన వివిధములయిన భారతీయ సంస్కృతి రంగములలో నూత్నవికాసము కలిగించినారు. ముఖ్యముగ శ్రీ అరవిందులు భారతీయ కళాభివృద్ధికిఁ జేసిన తపస్య భారతీయ కళాచరిత్రమున నొక ప్రధానఘట్టము.

శ్రీ అరవిందులు బాల్యమున నాంగ్లదేశమున విద్యార్థిగా నున్నపుడే వివిధములగు ప్రసిద్ధాంగ్ల పత్రికలకు కళావిమర్శాత్మకములగు వ్యాసములు వ్రాయుచుండెడివారు. ఆ వ్యాసము లా కాలముననే యనేకులగు నాంగ్ల చిత్రకళా విమర్శకులకు భారతీయ చిత్రకళను గూర్చిన యపోహలు తొలగించినవి.

తరువాతి జీవితమునఁ గొంతకాలము వరకును శ్రీ అరవిందులు మనకు రాజకీయ జీవితమునఁ బ్రత్యక్షమగుచున్నారు. ఈ కాలమున శ్రీ అరవిందులు విప్లవక్షేత్రమునఁ బ్రవేశించి కళాసంస్కృతి క్షేత్రములను విడిచినారని సామాన్యముగ ననుకొనుచుందురు; కాని యది సరికాదు. ఈ కాలమున బాహ్యముగ వారు విప్లవవాదిగ పనిచేయుచున్నను ఆ విప్లవ మెట్టి దృఢతరములగు పునాదులపై నడిపింపవలయునో యని యన్వేషించుచునే యుండిరి. ఆయన్వేషణలో క్రమముగ వారికి భారతీయాధ్యాత్మిక సంస్కృతి దృఢమగు పునాదిగ గన్పట్టెను. అప్పటినుండి వివిధ ముఖమగు నీ సంస్కృతి క్షేత్రమును బరిశీలించి వారింకను గంభీరమగు నాధ్యాత్మిక విప్ల

వమునకై తపస్య యొనర్చుచున్నారనునది యందరును నెరిగినదే। కావున మనము శ్రీ అరవిందులను సామాన్య విప్లవవాది యనుటకంటె మహత్తర సంస్కృతి విప్లవవాదియనుటయే యుక్తతరము. ముఖ్యముగ శ్రీ అరవిందాశ్రమమునఁ బ్రవేశించి, పరిమితమగు శిష్యవర్గముతో దృశ్యముగను నదృశ్యముగను భారతీయ సంస్కృతి క్షేత్రమున నొనర్చుచున్న విప్లవ మసామాన్యమైనది. వారి యాశ్రమము కవులకును, చిత్రకారులకును, గాయకులకును, వేదాంతులకును పరమపావనమగు పుణ్యక్షేత్రమైనది.

ఆశ్రమ ప్రవేశము జరుగుటకు పూర్వము శ్రీ అరవిందులు అంతరాదేశానుసారముగ రాజకీయరంగమును విడిచి యేకాంత మన్వేషింపవలసి వచ్చెను. అప్పుడు కొందరు శ్రీ అరవిందుల రాజకీయ విరమణ మొక పరాజయముగ భావించిరి. కాని యీ రాజకీయ విరమణమును పుదుచ్చేరి యందలి యేకాంతవాసమును యాధ్యాత్మిక సాధనకును ఆ సాధనలో నవ్య మార్గాన్వేషణకును నెక్కువగ నుపయోగించినవి.

శ్రీ అరవిందులు యేకాంతవాసియై యుండుటవలన వారిని ప్రపంచ విరక్తులగు నొక విరాగిగ భావించుట పొరపాటు. సామాన్యముగ మన మనుకొను విరాగులందరును కేవలమును నివృత్తిమార్గపరమగు సన్యాస మవలంబించి మనశ్శరీరముల నత్యధిక క్లేశమునకు బాల్పరుచుచుందురు. కాని శ్రీ అరవిందుల సాధన యట్టిదికాదు. మనఃశరీరములను బ్రవృత్తి మార్గమున బ్రవర్తింపజేయుచు వాని నాధ్యాత్మిక శక్తి పూర్ణములుగ నొనర్చుటే వారి యాశయము. కావుననే కళ వారికొక యాధ్యాత్మిక సాధనముగనే భాసించినది. అందుమూలముననే ఎంతోమంది వివిధ లలితకళాశీలులు వారి యాశ్రమమున నాధ్యాత్మిక సాధకులుగా బ్రవేశించుట జరిగినది. ఈ యాధ్యాత్మిక సాధనమును వారి కళాసాధనమును పరస్పర సాహాయ్యకములై పరస్పరాభివృద్ధికి తోడ్పడుచున్నవి.

కావుననే శ్రీ అరవిందులు బాల్యమునుండియు సమస్త కళలను తపస్యాదృష్టితో బరిశీలింపసాగిరి. ఆ పరిశీలనలో గోచరించిన కళాంతరార్థము 'ఆర్య' పత్రికా వ్యాసముల మూలమునను బహువిధ గ్రంథముల మూలమునను భారతీయుల కందించిరి. ఆ రోజులలో వారి వ్యాసములలో భారతీయకళ విషయమై సరియగు విమర్శనము ప్రకటించుటవలన పాశ్చాత్య వ్యామోహములో పడిన మనవారి కనేకములగు ప్రాచీన శిల్పములమీదను, చిత్రములమీదను నత్యధికముగ భక్తిశ్రద్ధ లేర్పడసాగినవి. ఆ రోజులలో శ్రీ ఆనంద కుమారస్వామికూడ యీ విషయమున నెంతో కృషిచేసి యెన్నో వ్యాసములు వ్రాసెను. అప్పుడు వీరిరువురి కృషివలనను భారత దేశమునందును, విదేశములయందును భారతీయ కళ విషయమై యత్యద్భుతమగు పరిణామమేర్పడినది. నాటినుండి నేటివరకును భారతీయ కళావిమర్శనమున నొక నవ్య దృక్పథమేర్పడిన విషయము మనమందరమును నెరిగినదే!

వివిధములగు కళావిమర్శనములు శిల్పవిమర్శనములేగాక యనేకములగు వాఙ్మయ విమర్శనలుగూడ శ్రీ అరవిందుల లేఖినినుండి బయలు వెడలినవి; ముఖ్యముగ 'ఆర్య' పత్రికలో శ్రీ అరవిందులు పాశ్చాత్య కళలను గూర్చియు వాఙ్మయమునుగూర్చియు వ్రాసిన వ్యాసములు చిరస్మరణీయములు పాశ్చాత్య వాఙ్మయమేగాక భారతీయ వాఙ్మయమునుగూడ నరవిందు లెక్కువగ పరిశీలించెను. ముఖ్యముగ నరవిందుని 'కాళిదాస' విమర్శనము ప్రపంచ విమర్శక గ్రంథములలో, నత్యుత్తమ విమర్శనములలో నొకటిగఁ బరిగణింపవలసియున్నది. దీనిలో నరవిందులు కాళిదాస మహాకవిని వ్యాస వాల్మీకులతో సరిపోల్చుచు వీరందఱును నొక్కొక్క వాఙ్మయ యుగమునకు బ్రధానమూర్తులని వ్రాసిచ్చినారు. 'కాళిదాస' విమర్శనము ప్రధానముగ 'నాతని ఋతుసంహారము'ను గూర్చినదేయైనను, కాళిదాసును గూర్చిన సంపూర్ణ విమర్శన మీ గ్రంథమున నున్నది.

శ్రీ అరవిందులు కేవలము కావ్యవిమర్శకులేకాదు. ఎన్నో మహా కావ్యములు వారి లేఖినినుండి వెలువడినవి. ఈ మధ్య వ్రాసిన "సావిత్రి"యు మిగిలిన కావ్యములును బరిశీలించిన వారు మహావిమర్శకులేగాక మహాకవికూడ నను విషయము సుస్పష్టమగును. శ్రీ అరవిందుల కవిత పరిశీలించినను విమర్శనము చూచినను వేదాంతము పఠించినను వీనికన్నింటికిని నంతర్భూతమగు నొక తాత్త్వికదృష్టియున్న విషయము సుస్పష్టమగును. శ్రీ అరవిందుల కవిత, కళావిమర్శకదృష్టి, వేదాంతము అను నీ మూడును ఒకదానిలో ఒకటి అంతర్భూతములై యుండును. కావున నీ మూడింటిలో నేయొక విషయమైనను మిగిలినవి పరిశీలింపనిదే మనము సంపూర్ణముగ నవగాహన చేసుకొనలేము.

శ్రీ అరవిందులు స్వయముగ చిత్రకారులు కాకపోయినను ప్రాచ్య పాశ్చాత్య చిత్రకళనుగూర్చిన వారి వ్యాసములు మహాగంభీరములు. ప్రతి ప్రాచ్య పాశ్చాత్య చిత్రకారుని గూర్చియు చిత్రసిద్ధాంతమును గూర్చియు వారు నిశితముగ బరిశీలించి చేసిన విమర్శనములు నేటికిని చిత్రకారులకు దివ్య జ్యోతులుగ నున్నవి. మొట్టమొదట యవనీంద్రుని ప్రతిభ లోకమునకెత్తి చూపినది శ్రీ అరవిందులే యను విషయము పెక్కురెరుగక పోవచ్చును. ముఖ్యముగ నీనా డనేకములగు పాశ్చాత్య చిత్రకళా సిద్ధాంతములు మనలను దిగ్భ్రాంతులనుగ నొనర్చుచున్నవి. కావుననే శ్రీఅరవిందుల విమర్శనములు మన మత్యావశ్యకముగ బఠింపవలసియున్నది. శ్రీ అరవిందుల రచనలు వర్తమానమునకేగాక భావికిగూడ మార్గదర్శకములనుట యతిశయోక్తికాదు.

(15-8-1948, శ్రీ అరవింద జయంతి సంచిక—
"అరవిందార్చన"లో ప్రచురితమైనది)

ప్రతులకు:

తె లు గు శా ఖ

శ్రీ అరవిందాశ్రమము

పుదుచ్చేరి-605002